ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 06, 2019

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

ఓ యువ.. యువా...!



రాకీ.. రాకీ...

★ కర్ణాటకలోని హస్సాన్ జిల్లా భువనహళ్లి నగరంలో అరుణ్‌కుమార్, పుష్ప దంపతులకు జన్మించారు నవీన్ కుమార్ గౌడ(యష్). ఆయన తండ్రి కెఎస్ఆర్టీసిలో బస్సు డ్రైవర్‌గా పనిచేసేవారు. యష్ చెల్లి పేరు నందిని.

★ మైసూర్‌లోని మహాజన పాఠశాలలో యష్ చదువుకున్నారు. ప్రముఖ నాటక రచయిత బి.వి కారత్ స్థాపించిన బినాకా డ్రామా ట్రూప్‌లో చేరారు.

★ కన్నడ ఓ టివిలో వచ్చిన 'నందగోకుల' అనే సీరియల్ ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత మరికొన్ని సీరియల్స్‌లో నటించారు.

★ 2007లో జంబాడ హుడుగి అనే చిత్రంలో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత 2008లో శశాంక్ దర్శకత్వంలో 'మొగ్గిన మనసు' చిత్రంలో రాధిక పండిట్‌తో కలిసి సహాయ నటుడుగా నటించారు. ఈ చిత్రంలో ఆయన నటనకుగాను ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు.

★ ఆ తర్వాత యష్ రాకీ, కల్లార సంతే, గోకుల చిత్రాల్లో ప్రధాన పాత్ర పోషించారు. 2010లో 'మొదలసల' అనే చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్నారు. గ్రామీణ నేపథ్యంలో వచ్చిన కామెడీ చిత్రంలో తన నటనకు మంచి గుర్తింపు లభించింది.

★ 2014లో కథానాయిక రాధిక పండిట్‌తో కలిసి నటించిన 'మిస్టర్ అండ్ మిసెస్స్ రామచారి' చిత్రం కన్నడ సినిమాల్లో ఎక్కువ కలెక్షన్లను వసూలు చేసింది.

★ ఆయన తాజా చిత్రం 'కెజియఫ్' తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో విడుదలై మంచి విజయం సాధించింది.

★ తనతో నటించిన కథానాయిక రాధిక పండిట్‌తో స్నేహం ప్రేమగా మారడంతో 2016లో ఆమెను వివాహం చేసుకున్నారు.

★ 2018 డిసెంబరు 3న వారికి పాప పుట్టింది. 'ఒక వ్యక్తిని చూడకుండా ప్రేమించడం ఎంతో అద్భుతమైన భావన కలిగిస్తుంది. ప్రస్తుతం నేను తనను చూడగలుగుతున్నాను. ఆమె చిన్ని చేత్తో నా వేలు పట్టుకుని తండ్రిగా నన్ను నడిపించింది' అని తన సంతోషాన్ని ట్విట్టర్‌లో వ్యక్తం చేశారు.



★ సినిమాలతో పాటు సమాజసేవ చేయాలన్న ఆశయంతో 2017లో భార్యతో కలిసి 'యషో మార్గ ఫౌండేషన్'ను ప్రారంభించారు. దీనిలో భాగంగా కర్ణాటకలోని కొప్పాల్ జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాల్లో రూ.4 కోట్లతో మంచినీటి సదుపాయాన్ని కల్పించారు.

డాల్ఫిన్‌లా...

డాల్ఫిన్‌లా నీటిపై ఎగురుతూ విన్యాసాలు చేయాలనుకుంటున్నారా..? అయితే, మీరు ఫ్లై-బోర్డింగ్ గురించి తెలుసుకోవాలి. ఒకప్పుడు డేర్‌డెవిల్స్ మాత్రమే ఈ సాహసక్రీడను ఇష్టపడేవారు. ప్రస్తుతం ఈ క్రీడలో పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇటీవల విజయవాడలోని కృష్ణానదిలో, అలాగే విశాఖ తీరంలోనూ దీని విన్యాసాలు అందరిని ఆకర్షించాయి. మన సినిమాల్లోని స్టంట్స్‌లో కూడా ఫ్లై బోర్డింగ్ సన్నివేశాలు కనిపిస్తున్నాయి. సాహసోపేత కార్యక్రమాల్లో పాల్గొనేవారు, సెలవుల్లో సరదాగా గడపాలనుకునేవారు ఈ క్రీడను ట్రై చేస్తున్నారు. ఫ్లైబోర్డింగ్‌లో.. ఓ పైప్‌కు ప్రత్యేకమైన బూట్లు, బాడీ స్యూట్ స్ట్రాప్ చేసి ఉంటాయి. పక్కనే ఉన్న బోటులో మోటార్ వేగంగా నీటిని పంపు చేస్తుంది. నీటి ఒత్తిడికి స్యూట్ తగిలించుకున్న రైడర్ పైకి లేస్తాడు. నీళ్లలోకి డాల్ఫిన్‌లా దూకుతూ వెళ్లొచ్చు. దీనిలో అనేక రకాల విన్యాసాలు చేయడమే చాలెంజ్. దాదాపు 15 మీటర్ల ఎత్తుకు, నీటిలో 2.5 మీటర్ల లోతుకు వెళ్లవచ్చు. తొలిసారిగా ఫ్రెంచ్ వాటర్ క్రాఫ్ట్ రైడర్ ఫ్రాంకీ జపాటా దీన్ని తయారుచేశారు. 2012లో చైనాలో జెట్ స్కై పోటీల్లో ఫ్లై బోర్డింగ్‌ను తొలిసారిగా ప్రదర్శించారు.

అట్టమీది కథ 6
ఓ యువ యువా..!

పనిపిల్ల 2
ఇదీ జీవితం

ప్రకృతి చిత్రంలో అతడు....5
వినూత్నం

వెలుగుల నగరం పారిస్..11
యమహా నగరీ

ఎల్లమ్మ ఎంపీడీఓ....14
కథ

జాను తెలివి రొయ్య
సాహసం....17
బాలల కథ

దారితప్పిన పిల్లవాడు...18
బాలల సీరియల్

ఇన్ని రీతులా..! 24
సుచిత్రమ్

విహారం 12
ఎగిరే ఊయల

అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఉండే హిమాలయన్ మార్మట్‌ల మీద ఈ మధ్యే జన్యు పరిశోధనలు జరిగాయి. భారత్, పాకిస్తాన్, చైనా, నేపాల్‌లోని హిమాలయాల్లో దాదాపు 5 వేల మీటర్ల ఎత్తున ఆక్సిజన్ సరిగ్గా అందని ఆ ప్రాంతాల్లో తీవ్రమైన చలిలో అవి ఎలా మనుగడ సాగిస్తున్నాయనేది శాస్త్రవేత్తల్ని ఆకట్టుకున్న విషయం. దీనికి రెండు జన్యువులు కారణమని తేల్చారు. సుమారు 20 లక్షల ఏళ్ల క్రితం మంగోలియన్ మార్మట్‌ల నుంచి వేరుపడిన ఈ క్షీరదాలు కాలక్రమంలో మనుగడ పోరాటంలో ఎత్తైన ప్రాంతాలకు తగ్గట్టుగా తమ జీన్ ఎక్స్‌ప్రెషన్‌ను మార్చుకుని పరిణామంలో ముందడుగు వేశాయని తేలింది. దాదాపు 6 నెలల సమయం శీతాకాల సుప్తావస్థ (హైబర్‌నేషన్)లో ఉండే ఈ జీవుల మెదడులోని రక్తం నియర్ ఫ్రీజింగ్ ఉష్ణోగ్రతలకూ గడ్డకట్టకుండా ఉండే ఏర్పాటు జరిగింది. మెదడులో గాయాలైతే వాటి బ్రెయిన్ స్టెమ్‌సెల్స్ స్వతహాగా రిపైర్ చేసుకోగలవని పరిశోధకులు నిర్ధారించారు. మనుషులకు ప్లేగ్, హెచ్‌పీవీ వ్యాధుల్ని సంక్రమింపజేసే ఈ జీవుల జీనోమ్‌పై మరిన్ని పరిశోధనలు చేసి వాటి రోగనిరోధక వ్యవస్థ పనితీరుని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎవ్వడికెవ్వడు బానిస
ఎవ్వడికి వాడే బాద్షా
ఒత్తిచూసే తొత్తు కొడుకుల
నెత్తెక్కి ఆడేయ్ ధింసా
రగిలే చూపులు మౌన
శంఖారావంలా
ఎగసే ఊపిరి యుద్ధ భేరీ
నాదంలా
నిర్జించరా దౌర్జన్యాన్నీ వేళ

గీతం : ఎవ్వడికెవ్వడు బానిస
చిత్రం : కెజిఎఫ్-1
రచన : రామజోగయ్య శాస్త్రి

'మిమ్మల్ని బలవంతులుగా చేసే
ప్రతి ఆశయాన్ని స్వీకరించండి,
బలహీనపరిచే ప్రతి ఆలోచననూ
తిరస్కరించండి'

'రోజుకు ఒక్కసారైనా
మీతో మీరు మాట్లాడుకోండి...
లేకపోతే ఓ అద్భుతమైన వ్యక్తితో
సంభాషించే అవకాశాన్ని కోల్పోతారు!'

- స్వామి వివేకానంద

30-12-2018 నాటి 'స్నేహ' సంచిక 'అట్టమీది కథ'గా 'స్క్రీనేజర్లు @ 2019' వర్ధమాన ప్రపంచ సమాజ చిత్రణకి దర్పణంగా నిలిచింది. 'గెలుపు కథలు' స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. 'అబ్బాయి', 'దశావతారాలు', 'బడి పిలుస్తోంది' మూడు భావ కవితలు హృద్యంగా ఉన్నాయి. 'సహజస్నిగ్ధత' దృశ్యాలు కనువిందు చేశాయి. 'కొత్త కాంతుల జలపాతం' విశేషాలు అబ్బుర పరిచాయి. 'వినూత్నం'లో 'టుఫీ-కొరఫీ' తెగ గురించి సవివరంగా తెలుసుకున్నాం. 'అమ్మ చేసిన హత్య' కథ బాగుంది. ధన్యవాదాలు.

- నేమాన సుభాష్ చంద్రబోస్
విశాఖపట్నం

ఇప్పుడు ఇళ్లలోనూ, ఆఫీసుల్లోనూ వాయు కాలుష్యం పెరుగుతోంది. దానికి తగ్గట్టు లోపలి గాలిని ఫిల్టర్ చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు వచ్చేస్తున్నాయి. కానీ, వీటి వాడకమూ పరోక్షంగా కాలుష్య కారకమే. అందుకే, కొన్ని హౌజ్ ప్లాంట్ల మీద ప్రయోగాలు చేసి వాటి ద్వారా గాలిని శుభ్రపరిచే ప్రయత్నం జరుగుతోంది. ఈ మధ్యే వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ బృందం పాథోస్ ఐవీ అనే ఓ కామన్ హౌజ్‌ప్లాంట్‌కు జన్యుమార్పిడి చేశారు. అది విజయవంతంగా గాలిలోని క్లోరోఫామ్, బెంజీన్ వంటి విషవాయువుల మిశ్రమాల్ని గ్రహించింది. వాటిని తన ఎదుగుదలకూ ఆ మొక్క వాడుకోగలిగింది.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా :
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ :
snehaweekly.praja@gmail.com

పనిపిల్ల

- కేఆర్టీ
9849568901

'లక్ష్మీ.. ఇవిగో ఈ అంట్లు కూడా తోము' సుభద్ర నాలుగు పాత్రలు తెచ్చి పని మనిషి దగ్గర పడేసింది.

లక్ష్మి హతాశురాలయింది.

అప్పటికే అయిదుగంటలయ్యింది. చలికాలం సాయంత్రం పొద్దు త్వరగా ముగిసిపోతుంది. వెలుగు మెల్లగా చీకట్లో కలిసిపోతోంది.

అయిదిళ్ళలో అంట్లు తోమి అక్కడికొచ్చింది. అదే చివరి ఇల్లు. పని త్వరగా పూర్తి చేసుకొని ఇంటికి వెళ్ళాలని ఆత్రుత పడుతుంటే... ఇప్పుడిలా మరో నాలుగు గిన్నెలు తెచ్చి పడేసింది సుభద్రమ్మ.

'అమ్మా! మా ఆయనకి జ్వరంగా ఉంది. వళ్ళు తెలీకుండా పడి ఉన్నాడు. ఇంటికాడ చిన్న పిల్లనుంచి, పెద్దపిల్లని సాయంగా తెచ్చుకున్నాడు. అయిదిళ్ళు చేసి అలిసిపోయానమ్మా.. రేపు తోముతాలేమ్మా'

'ఎంతసేపట్లో తోముతావు లక్ష్మీ... నీ కూతుర్ని కూడా సాయం చెయ్యమను. త్వరగా అయిపోతాయి. ఊరికే వద్దులే. ఇవాళ మా ఇంట్లో వ్రతం చేశాంగా.. మిగిలిపోయినవన్నీ నీకే.. పులిహోర, పాయసం, బజ్జీలు, అన్నం... అన్నీ బుట్టలో సర్దిపెట్టాను. వెళ్ళేటప్పుడు తీసుకువెళ్ళుదువుగానీ.!

లక్ష్మి ఇక మాట్లాడలేకపోయింది.

పెద్ద కూతురు ఎదురుగా నీరసంగా కూర్చుంది. అయిదో క్లాసు చదువుతోంది. తనకి అన్ని పనుల్లో సాయం చేస్తుంటుంది. చిట్టి చిట్టి చేతుల్తో అంట్లు తోముతుంటే, లక్ష్మి మనసు తరుక్కుపోతుంది. ఆ చేతులు అలసిపోయి, వేళ్లతో పెన్సిలు పట్టుకోలేక, సరిగా నోట్సులు రాయలేక ఇబ్బంది పడుతుంటే లక్ష్మికి కన్నీళ్లాగవు. మొహం తిప్పుకుని కొంగుతో అద్దుకుంటుంది.

• • •

ఇద్దరు ఆడపిల్లలు పుట్టినా కోపగించుకోని మంచి మొగుడు మల్లయ్య. తనని మల్లె చెండులా చూసుకుంటాడు. పిల్లలిద్దర్నీ పెద్ద బంగారం, చిన్న బంగారం అని ముద్దుగా పిలుచుకుంటాడు.

స్తోమత లేకపోయినా రెక్కల కష్టంతో పిల్లల్ని చదివించుకుంటోంది. మొగుడు రిక్షా తొక్కుతాడు. ఆటోల జోరు పెరిగాక రిక్షాలు ఎవరెక్కుతున్నారు? అలాగే బతిమాలి బామాలి వాళ్ళిచ్చిన దానితో తృప్తి పడి రిక్షా నడుపుకుంటున్నాడు.

ఒకప్పుడు అది అద్దెరిక్షా.

తను తిన్నా తినకపోయినా కిరాయి కరెక్టుగా కట్టేసేవాడు. యజమాని రిక్షాలు అమ్మేసి ఆటోలు కిరాయికివ్వసాగాడు. మల్లయ్యకి అతని మంచి తనానికి గుర్తింపుగా ఉచితంగా రిక్షా ఇచ్చేశాడు.

కళ్ళు చెమరిస్తుండగా, చేతులు జోడించి మాటలు రాక నిలబడిపోయాడు మల్లయ్య. ఆప్యాయంగా భుజంతట్టి 'పెళ్ళాం పిల్లల్ని బాగా చూసుకో' మన్నాడు.

కొత్త రిక్షా అద్దెకు తీసుకున్నప్పుడు కొత్తకాపురం కొత్తపెళ్ళాం. అప్పుడప్పుడు రిక్షాలో తిప్పేవాడు. సిటీ అంతా చూపించాడు. సినిమాక్కూడా తీసుకెళ్ళాడు.

ఇద్దరు పిల్లలు పుట్టాకా రిక్షాతో బాటు పెళ్ళాం కూడా పాతదైపోయింది. అప్పుడప్పుడు పాత జ్ఞాపకాలతో నవ్వుకుంటారు.

• • •

'అమ్మా! అంట్లు తోమేశాను. వెళదాం పదా...' లక్ష్మి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బయటపడింది. పరధ్యానంలో గమనించలేదు. కూతురు చొరవగా అంట్లు తోమి తొలిచేసింది. లక్ష్మి తన మందబుద్ధిని తిట్టుకుంటూ ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయింది. సుభద్రమ్మ మిగిలిపోయిన వంటకాలు పెట్టిన బుట్ట చేతికిచ్చింది. దాన్ని భుజాన పెట్టుకుని కూతురితో ఇంటిదారి పట్టింది లక్ష్మి.

మనిషితోబాటు ఆలోచనలూ నడిచాయి.

మనసుకి విశ్రాంతి తెలియదు. ఎప్పుడూ ఏదో ఆలోచనతో సతమతమౌతుంటుంది.

సుభద్రమ్మ ఇంటెడు చాకిరీ చేయించుకుంటుంది. మిగిలిపోయినవన్నీ మొహాన పడేస్తుంది. ఒక్కోసారి పాచి అన్నం పెడుతుంది. నీళ్లతో కడుక్కుని, వాసనపోయాక దాన్నే అమృతంగా పిల్లలతోబాటు తింటుంది.

మొగుడికి మాత్రం వేడి అన్నం వండిపెడుతుంది. కష్టపడే మొగుడికి తిండి సుఖం లేకపోతే ఎలా? మల్లయ్య పెళ్ళాం వారిస్తున్నా వినకుండా మిగిలిన వారితో బాటు చద్దన్నం పెట్టుకుంటాడు. లక్ష్మి సణుగుతుంటే నవ్వుకుంటాడు. పెళ్ళాని ప్రేమగా చూసుకోకపోతే ఎలా?

ఎంత కష్టపడుతుంది. చీకటితో లేచి పొద్దుపోయేదాకా కష్టపడుతుంది. తనని సుఖపెట్టాలని తాపత్రయ పడుతుంది. ఇంత మంచి పెళ్ళాం ఎంత పుణ్యం చేసుకుంటే దొరుకుతుంది...

• • •

లక్ష్మి దారిలో మందుల దుకాణం దగ్గర ఆగి జ్వరానికి మాత్రలుకొంది. కూతురు బుట్ట నెత్తిమీద పెట్టుకు నిలబడింది. మందులు జాకెట్లో పెట్టుకుని 'బుట్ట ఇటివ్వు' అంది. 'నే తెస్తాలే అమ్మా' అంటూ ముందుకు నడిచింది. వెనుకనుంచీ పిల్లను చూస్తూ తన చిన్నతనం గుర్తు చేసుకుంది.. ఇలాగే చురుగ్గా ఉండేది. తల్లికి అన్ని పనుల్లో సాయం

చేసేది. మంచి పనిపిల్ల బతుకు కాకుండా మంచి ఉద్యోగంలోచేరాలి. మహారాణిలా సుఖంగా బతకాలి.

పనిపిల్ల తనలాగా పనిమనిషిగా మారకూడదు.

అందుకే ఆశలన్నీ గుండెల్లో నింపుకుని, ఆడపిల్లలిద్దర్నీ చదివిస్తోంది. ఇద్దరూ రెండుకళ్ళు అనుకుంది. కళ్ళకి రెప్పల్లా కాపాడు కుంటోంది. తనకు లేకపోయినా వాళ్ళకి పెట్టి తన కడుపు నిండినట్టు ఆనంద పడుతుంది.



ఆలోచనల్లోనే ఇల్లొచ్చేసింది.

కాళ్ళూ, చేతులూ, మొహం కడుక్కుని కూతురు చేతుల్లోంచి బుట్ట అందుకుంది. ఇంట్లోకి అడుగు పెడుతూనే మంచంమీద మునగదీసుకు పడుకున్న మొగుణ్ణి చూసింది. జ్వరం బాగా ఉన్నట్టుంది. చలికి సన్నగా వణకుతున్నాడు. చిరుగుల పాతరగ్గు కప్పింది. కళ్ళు తెరిచి పెళ్ళాన్ని చూశాడు 'వచ్చావా?' అన్నాడు. సన్నగా వణుకుతున్న గొంతుతో.

'ఆఁ.. ఏవన్నా తింటావా?'

'వేడిగా గంజి ఇవ్వు చాలు'

'అమ్మా! ఆ బుట్టలోవి ఇద్దరూ తినండి. నేను అయ్యకి గంజి తాపించి వస్తా' అంటూ వంటిట్లోకి వెళ్ళింది.

పిల్లలిద్దరూ బుట్టలోవి తీసి బయటపెట్టారు. ఒక్కోటి ఇష్టంగా తింటున్నారు.

'అమ్మా! నాకు లేకపోయినా ఫర్వాలేదు ఇద్దరూ కడుపు నిండా తినండి' వంటింట్లోంచి కేకేసింది లక్ష్మి. మరో పది నిమిషాల్లో వేడి వేడి గంజి గిన్నెలో పోసుకుని వంటింట్లోంచి బయటకొచ్చింది.

ఎదురుగా దృశ్యం చూసి చేతిలో గిన్నె జారిపడిపోయింది. ఇద్దరు పిల్లలూ నురగలు కక్కుతూ నేలమీద విగతజీవులై పడి ఉన్నారు... లక్ష్మి బిగుసుకుపోయింది.

• • •

'బల్లి పడిన పరమాన్నం ఏంచేశావ్? పారేశావా?' సుభద్రమ్మ మొగుడు అడిగాడు భార్యని.

'పారెయ్యడం దేనికి? పనిమనిషి లక్ష్మికిచ్చాను..'

'జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు. కష్టాలు, కన్నీళ్ళతో దరిద్రరేఖ దిగువున బతికేవారి జీవితాల గురించి, సమాజ వేగంలో మనం గమనించం. మన పాదాల కింద పడి నలిగే చీమల కాళ్ళు విరిగిన చప్పుళ్ళు మనకేనాడూ వినిపించవు. వాటి ఆక్రందనలు చావు కేకలు- మనసుతోనే వినగలం. మన కళ్ళ ఎదుటే జీవచ్ఛవాల్లా, దరిద్రాన్ని బాధల గాధల్ని మోసుకుంటూ తిరిగే బడుగు జీవుల జీవితాల గురించి తెలుసుకోవాల్సిన సామాజిక బాధ్యత మన మీద ఉంది. ఆ జీవన చిత్రాల కథల్ని 'ఇదీ జీవితం' శీర్షిక ద్వారా సీనియర్ రచయిత 'కేఆర్టీ' ప్రజాశక్తి పాఠకులకు ప్రత్యేకంగా అందిస్తున్నారని తెలుపటానికి ఆనందిస్తున్నాం.

'ఓసి నీ మతిమండ, అది విషమే.. పనివాళ్ళకి ఏదిపడితే అదివ్వడమేనా? వాళ్ళు మనలాంటి మనుషులుకారా? నువ్వు రాక్షసివి, పిశాచివి, హంతకురాలివి..' భర్త తిడుతూనే ఉన్నాడు.

(వాస్తవకథ ఆధారంగా)

మనచుట్టూ సింహాలు ఉంటే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి కాస్త భయంగానే ఉంది కదా! అదీ ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 77 సింహాల మధ్యలో ఉండే అవకాశాన్ని కల్పిస్తున్నారు ఓ గెస్ట్‌హౌస్‌లో..! దక్షిణ ఆఫ్రికాలోని హరిస్మిత్ ప్రాంతంలో క్రూర మృగాల అభయారణ్యం మధ్యలో ఈ గెస్ట్ హౌస్‌ని ఏర్పాటు చేశారు. అక్కడకు వెళ్లే పర్యాటకుల కోసం సాహసానుభూతులను పొందేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నారు. ఇంటి చుట్టూ ఐదు కి.మీల పరిధిలో విద్యుత్ తీగలతో కంచెను వేసి మధ్యలో ఇంటిని ఏర్పాటు చేశారు. సింహాలను దగ్గరగా చూసే అవకాశం కోసం అక్కడకు వెళ్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా అలాంటి అనుభూతిని పొందాలనుకునే సాహసికులకు ఇదొక గొప్ప అవకాశమట..! ఒకేసారి ఈ ఇంట్లో ఆరుగురు ఉండేందుకు వీలు కల్పిస్తున్నారు. ఒక్కరోజు ఉండటానికి 104 డాలర్లు తీసుకుంటారు. ఓ రాత్రి ఆ సింహాల గాండ్రింపుల మధ్య బెరుకు బెరుకుగా గడపడం సాధారణ విషయమేమీ కాదు.

పక్షులతో చేపలవేట...!

ప్రత్యేకం

చైనా ప్రధాన పట్టణమైన సుయిన్ వద్ద లీజియాంగ్ నది చేపలవేటకు అనుకూలమైన ప్రదేశం. అయితే, అక్కడ చేపలను పట్టే విధానం కాస్త వినూత్నంగానే ఉంటుంది. వీరు కార్మొరాంట్స్ పక్షులను ఆధారంగా చేసుకుని చేపలను పడుతుంటారు. ఇవి దాదాపు 40 జాతుల పక్షులు ఉన్నాయి. వీటిని షాగ్ అని కూడా పిలుస్తారు. వీటి ఆధారంగా చేపలను పట్టేవారు కార్మోరాంట్స్ మత్స్యకారులుగా పేరుగాంచారు. రచయితలకు ప్రేరణ కలిగిస్తోన్న ఈ పక్షుల గురించి మత్స్యకారుల గురించి కొన్ని సంగతులు తెలుసుకుందామా!

ప్రావస్తు శాఖ ఆధారాల ప్రకారం కార్మోరాంట్ మత్స్యకారులు ఈజిప్టు, పెరూ, కొరియా, భారతదేశంలో ఉన్నప్పటికి ఈ పద్ధతి జపాన్, చైనాలో స్థిరపడిపోయింది. జపాన్‌లో ఈ పద్ధతిని 'ఉకాయ్' అని పిలుస్తారు. చైనాలో ఈ పద్ధతి ద్వారా చేపలను పట్టే నైపుణ్య మత్స్యకారులకు ప్రత్యేకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

పర్యాటకులను ఆకర్షిస్తూ..

సుయిన్ ఓ చిన్న ప్రాంతం. ఇక్కడ యాంగ్‌షుయో నది తీరాన్ని దాటి లీ నదీ తీరానికి చేరుకోవడానికి మూడు ఇరుకైన డ్యాములు దాటుకుని వెళ్లాలి. యాంగ్‌షుయో ఈశాన్యంలో గులిన్ నగరం పరిధిలోని ఓ ప్రాంతం. దీని చుట్టూ ఎత్తైన తెల్లని సుద్ద పర్వతాలు, లీ జియాంగ్ నది ఉంది. అక్కడకు బస్సు, పడవ ద్వారా చేరుకోవచ్చు. అక్కడ కర్ట్ పర్వతాలను, గులిన్ సమీపంలో అందమైన దృశ్యాలను చూసేందుకు సందర్శకులు వస్తుంటారు. చైనాలో అత్యంత సుందర దృశ్యాలు యాంగ్‌షుయోలో చూడవచ్చు. 20 కోట్ల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతం సముద్రమట్టం కంటే దిగువగా ఏర్పడింది. ఆ ప్రాంతం శిఖరాలు, గుహలుతో నిండి ఉంటుంది. యాంగ్‌షుయోలో 1980-90 మధ్య ప్రారంభమై నేటికీ సందర్శకులు ఘణనీయంగా పెరిగారు. చుట్టుపక్కల ప్రాంతాల వారినీ అకర్షించే ప్రాంతంగా మారింది. అక్కడ దాదాపు 3లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. యాంగ్‌షుయో ప్రాంతంలో ఎక్కేందుకు మూన్ హిల్ ఎంతో ప్రసిద్ధిగాంచింది. తక్కువ ఎత్తులో ఉండే పర్వతాలు టిన్, గేట్స్, బేబీ ఫ్రాగ్, గుల్లిన్ గ్రోవ్, వైన్ బాటిల్ పర్వతాలు ఉన్నాయి. చైనాలో అతి పెద్ద విదేశీ భాషా కేంద్రం 'వెస్ట్ స్ట్రీట్'గా స్థిరపడింది. 1400 సంవత్సరాల చరిత్ర ఉంది దీనికి. ఇతర దేశాల నుంచి చదువుకునేందుకు వచ్చే వారు యాంగ్‌షుయోలో ఉన్న రెండు వీధుల్లో ఉండటం వల్ల ఆ వీధులని సందర్శనలు 'విదేశీయుల వీధులు'గా ఆ గ్రామాన్ని 'గ్లోబల్ విలేజ్'గా పిలుస్తారు. అక్కడవారితో సంభాషించే క్రమంలో ఆ గ్రామంలో అందరూ చైనాతోపాటు ఇంగ్లీషు మాట్లాడుతున్నారు.

పక్షులకు ట్రెయినింగ్

అక్కడ మత్స్యకారులు చేపలు పట్టే విధానం కాస్త ఆసక్తిగానే ఉంటుంది. ఓ సాంప్రదాయ పద్ధతిలో చేపలను పడతారు. లీ నదిలో చేపలను పట్టేందుకు పక్షులకు ట్రెనింగ్ ఇస్తారు. ఈ పద్ధతిని 'ఉకాయ్' అంటారు. జపాన్, చైనాల్లో 9వ శతాబ్దం నుంచి చేపలను ఈ పద్ధతిలోనే పడుతున్నారట. మత్స్యకారులు పక్షి గొంతుకు దగ్గర ఒక తాడులాంటి వలను కడతారు. తర్వాత పక్షులను నీటిలోకి తోస్తారు. ఆ పక్షి నది అడుగు వరకూ వెళ్లి చేపను గొంతుకలో పెట్టుకుని తిరిగి పడవలో ఉన్న మత్స్యకారుడి దగ్గరకు వస్తుంది. వారు ఆ పక్షి గొంతుకులో ఉన్న చేపను తీసి దానికి ఇష్టమైన ఆహారాన్ని పెట్టి పంపిస్తారు.

మత్స్యకారులే సంరక్షకులు

కార్మొరాంట్స్ పక్షి ఈకలతో దుస్తులను తయారు చేసిన మహిళను కాలిఫోర్నియా దక్షిణ తీరంలో శాన్ నికోలస్ ద్వీపంలో 1853లో కనుగొన్నారు. ఆమె కేవలం ఆ పక్షలను ఆధారంగా చేసుకుని 18 సంవత్సరాలపాటు జీవనాన్ని సాగించారట.



కార్మోరాంట్ జాతి పక్షులను కాపాడేందుకు మత్స్యకారులు ఎంతగానో తోడ్పడుతుంటారు. అనేక పక్షులు మత్స్యకారుడి సంరక్షణలో ఉంటాయి. అందుకు ఇక్కడ చేపల వేటను ఎంతో ఆనందభరితంగా కొనసాగిస్తుంటారు. 2018లో చేసిన ఓ సర్వేలో ఈ జాతి పక్షులు గణనీయంగా పెరుగుతున్నాయని పక్షిశాస్త్రవేత్తలు తెలింది.

ప్రేరణ కలిగిస్తూ..

కార్మోరాంట్ పక్షులు అనేక మంది రచయితలకు ప్రేరణ కలిగించాయి. 'ఆమీ క్లాంపిట్' అనే వ్యక్తి 'ది కార్మోరాంట్స్ ఇన్ ఇట్స్ ఎలిమెంట్" అనే పద్యం రాశారు. ఆ పక్షులకు సంబంధించిన గోప్పతనం గురించీ, అనేక అంశాలపై పక్షి శాస్త్రవేత్తలు ఎన్నో పుస్తకాలు రాశారు. వీటిపై ఎన్నో పరిశోధనలు చేశారు. దీనితోపాటు ఆ పక్షిని మచ్చిక చేసుకున్న విధానం, ఏ జాతి పక్షి ఎంత దూరం ఎగురుతుంది, ఆ పక్షి నీటిలో ఎంత లోతుకు వెళ్లగలుగుతోంది, వాటి బరువు, వాటి రెక్కల నైపుణ్యం, వాటి పేర్లతో సహా అన్ని ఈ విషయాలనీ ఆ రచయిత రాసిన పుస్తకాల్లో చూడవచ్చు. రెడ్-కాల్డ్ కార్మోరాంట్, ఫలాక్రొకోకక్స్ గైమార్డి, బ్లూ-ఐడ్ షాంగ్, హైపోలెక్యూ, లాకోకార్బో, నాటోకార్బో ఇలా 40 పక్షి జాతులు పైబడే ఉన్నాయి. ఒక్కో జాతికి ఒక్కో ప్రత్యేకత ఉంటుందని చెబుతున్నారు మత్స్యకారులు.

వెదురు తెప్పలపై..

యాంగ్‌షుయో, ములుంగ్ నదుల సంగమం వద్ద వెదురు తెప్ప మీద చేపలను పట్టడమే కాదు అక్కడ కొన్ని గ్రామాలకు వెళ్లాలన్నా అవే ఆధారం. అలా వెళ్లేందుకు అక్కడ తెప్పలతో పాటు పడవలు, కయాక్‌లు, డింగీస్ ఉంటాయి. ఆ ప్రాంతపు దృశ్యాలు లెక్కలేనన్ని పోస్టర్లలో కనిపిస్తుంటాయి. ఆ ప్రాంతం చుట్టూ పొగ మంచుతో కప్పబడి తెప్పలపై చేపలను పడుతున్న మత్స్యకారుల దృశ్యాలు వీనుల విందుగా ఉంటాయి.

- వర్ధని

ప్రకృతి చిత్రంలో అతడు

కొన్ని వేల పదాల్లో చెప్పలేని భావాన్ని ఓ ఛాయా చిత్రంలో చూపించొచ్చు. ఎన్నో సజీవ సాక్ష్యాలను తెలిపేది ఛాయా చిత్రం. ఫొటోగ్రఫీ ఓ సృజనాత్మక కళ. ఆధునిక శాస్త్రసాంకేతికతతో పాటు ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకుంటూ ముందుకు సాగిపోతున్న ఈ ఫొటోగ్రఫీలో అతి కొద్దిమంది మాత్రమే శిఖరాగ్రానికి చేరుకోగలరు. ఆ శిఖరాగ్రాన్ని చేరుకునే వారిలో ఒకరైనవారు థామస్ విజయన్.

ప్రకృతి ప్రేమికుడు థామస్ విజయన్. ఫోటోగ్రఫీ ఆయనకు అభిరుచి ఆ అభిరుచితోనే రకరకాల అడవి ప్రాంతాల్లో ఉండే జంతువుల కోసం అన్వేషణ ప్రారంభించి ప్రపంచ వ్యాప్తంగా ప్రయాణం చేసిన వ్యక్తి థామస్. మరి ఆయన గురించి కొన్ని విషయాలను తెలుసుకుందాం.

'పరిపూర్ణతను సాధించానని అనుకోవడం లేదు కానీ, నేను తీసిన, తీయాలనుకున్న ప్రతి ఫోటో నుంచీ కొత్త విషయాన్ని నేర్చుకున్నాను. నా అభిరుచిని పెంపొందించుకునే క్రమంలో ప్రకృతికి చేరువయ్యాను. మనిషికి, ప్రకృతికి ఉన్న సంబంధాన్ని తెలుసుకోగలిగాను. ఈ క్రమంలో నా కుటుంబాన్ని మరింత ప్రేమించగలుగుతున్నాను' అని ఓ ఇంటర్వ్యూలో తన కళపై ఎందుకు, ఎలా ఆసక్తో వివరించారు థామస్ విజయన్. ఆయన తీసిన ఫోటోలకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఫేస్‌బుక్‌లో అయితే కోటికి పైబడే ఫాలోవర్స్ ఉన్నారు.



ఏడు ఖండాలను చుట్టి

థామస్ విజయన్ కేరళ వాసి. ఆయన ఓ ఆర్కిటెక్. బెంగుళూరులో విద్యాభ్యాసం చేసి తర్వాత కెనడాకు తరలివెళ్లారు. కుటుంబంతో అక్కడే స్థిరపడ్డారు. ప్రస్తుతం డిఇఎస్‌సిఓ కంపెనీలో సిఇఓగా పనిచేస్తున్నారు థామస్. చిన్ననాటి నుంచీ నేచర్ ఫోటోగ్రఫీ అతని జీవితంలో ప్రధాన భాగమైపోయిందట. ఆ అభిరుచితో ఏకంగా ఏడు ఖండాలను చుట్టి అనేక ప్రదేశాలను సందర్శించారు. తాను తీయాలనుకున్న ఫోటోల కోసం ఒక్కో ప్రాంతంలో రోజులు నెలల తరబడీ గడుపుతారట. భారతదేశంలోనే ప్రకృతి, వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా ఖ్యాతికెక్కాడు. అయితే వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా దక్కిన అవార్డు థామస్‌కు అంత సులభంగా ఏమీ రాలేదు. అందుకు ఆయన అనుభవాలను తెలుసుకోవాల్సిందే.

అనుభవం ప్రేరణాత్మకంగా

ఫోటోగ్రఫీలో ఆయన తెలుసుకున్న విషయాలూ, తాను ఎంచుకున్న థీమ్‌ని ప్రేక్షకులతో, పలు జూనియర్స్‌తో పంచుకున్నదీ ప్రేరణాత్మకంగా ఉంటుంది. థామస్ మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, అమెరికా, భారతదేశం ఇలా ఫోటోగ్రఫీ కోసం సుమారు ఏడు సంవత్సరాలు ఆ ప్రాంతాల్లో గడిపారు. అనేక రకాల జంతువులు, పక్షులు, కీటకాలనూ క్లిక్‌తో బంధించేస్తారు. ఫోటో తీయడం కోసం పులి స్వభావం, వాటి ప్రవర్తన, ఉన్న పరిస్థితులను, అన్వేషించి మరీ స్పందించాలని అంటారు థామస్. వన్య ప్రాణులపై మక్కువతోనే కాకుండా వాటి గురించి అవగాహన కల్పించడానికి ఆయనకున్న అభిరుచి ఎంతగానో ఉపయోగ పడుతోందంటారు. పులులంటే భయపడని వారంటూ ఉండరు. కానీ, థామస్ మాత్రం దూకుతున్న పులిని ఫోటో తీయడం కోసం వీక్షించే కథనే చెప్పుకొస్తారు. ప్రపంచంలో అత్యంత గంభీరమైన క్రూరమైన, అడవి జంతువు బిడ్డకు ఆహారం కోసం ప్రయత్నిస్తున్న సందర్భంలో ఫోటోలు తీయడానికి ఇష్టపడతారట. జంతువుల సున్నితత్వం, వాటి కరుణ, జీవన ప్రయాణం గురించి ఆయన తీసిన ఫోటోల ద్వారా సందేశం ఇవ్వాలని కోరుకుంటారు.



విశేషం



అంతరించిపోతూ..

థామస్ తీసిన ఓ చిత్రానికి 2015లో పీపుల్స్ చాయిస్ వారిచే 'ఏ స్వింగ్ టైమ్' అనే ఓ ప్రతిష్టాత్మకమైన అవార్డు థామస్ విజయన్‌ను వరించింది. ఆ చిత్రంలో ఓ చెట్టు చుట్టూ బూడిద రంగులో ఉన్న ఓ జాతి కోతి కుటుంబం, తల్లి తోకను పట్టుకుని పిల్ల కోతి వేలాడుతున్న దృశ్యమది. ఆ చిత్రం ద్వారా ఆ కోతి కుటుంబంతో ఎలా జీవిస్తుందనేది చూపించాలనుకున్నారు. అయితే నేడు ఆ జాతి అంతరించిపోతున్నాయనే విషయాన్ని ఆ ఫోటో ద్వారా తెలియజేయాలనుకున్నారు.

అట్టమీది కథ

ఓ యువ.. యువా..!

- సత్యాజీ
9490099167

యువతీ యువకులు ఎప్పుడూ కొత్త మార్పులను ఆహ్వానిస్తారు. పాతలోని చెడుని నిరాకరిస్తారు. కొత్తలోని మంచిని స్వాగతిస్తారు. తమకోసం మాత్రమే ఆలోచించరు. తమ చుట్టూ ఉన్న పరిస్థితులనూ పట్టించుకుంటారు. సమస్యను గుర్తిస్తారు. కారణం కనుక్కొంటారు. పరిష్కారం కోసం ప్రయత్నిస్తారు. ప్రతి తరంలోనూ ముందు తరాలకోసం ఆలోచించే యువత గణనీయంగానే ఉంటుంది. ఇది ఆ వయో వ్యవధిలో ఒక సహజ ఉత్సాహ లక్షణం. కెరీర్ అనేది ఇప్పట్లా వెంటబడి తరమకుండా ఉన్నప్పుడు ఈ సామాజిక స్పృహ ఎక్కువగా ఉండేది. ఇప్పుడంతా పెట్టుబడితో కూడిన ప్రయివేటు విద్యాభ్యాసం. కెరీర్ నిర్మాణం కోసం పరుగులు పెడుతున్న కాలం. ఏదో ఒకలా నెగ్గుకురావాలనే తపన బలంగా నెడుతున్న సందర్భం. ఖర్చు పెట్టాం కాబట్టి, అది ఏదొక రూపంలో అందిపుచ్చుకోవాలనే తాపత్రయం నడిపిస్తున్న తరుణం. కాబట్టి- యువతరానికి సహజంగా ఉండే సామాజికోత్సాహం అణచివేతకు గురవుతోంది.

ముందు తరాల మేలు కోరి ...

గుత్తాధిపత్యాలూ, సంపన్న సామ్రాజ్యాలూ అంతకంతకూ విస్తరిస్తున్న వర్తమాన వాస్తవం కళ్లెదుట కనిపిస్తూనే ఉంటుంది. విద్య, వైద్యం వంటి వాటికి ఖరీదు పెరగటం కనిపిస్తూనే ఉంటుంది. ఎవరో అధికార పీఠం ఎక్కడం కోసం సమాజంలో విబేధాలూ, వివాదాలూ సృష్టిస్తున్న వైనం కనిపిస్తూనే ఉంటుంది. కాలం శాస్త్ర సాంకేతిక ప్రగతి పట్టాల మీద పయనిస్తున్న సత్యం తెలుస్తూనే ఉంటుంది. అదే సమయంలో ఛాందసం, అంధయుగపు ఆచారాలూ కొత్త భాష్యాలతో ముందుకొస్తూనే ఉంటాయి. వీటిన్నిటి మధ్య నిజం ఏమిటి? కారణం ఏమిటి? కల్పించేదెవరు? కవ్విస్తున్నదెవరు? వంటి ప్రశ్నలు సహజాతి సహజంగా తలెత్తాలి. వాటికి సమాధానాలు తార్కికంగా, శాస్త్రబద్ధంగా అన్వేషించాలి. ఇలాంటి ఆలోచన, అవకాశమూ ఇవ్వకుండా యువతరాన్ని గందరగోళానికి గురి చేసే 'పరిస్థితులు' ఎప్పటికప్పుడు నెలకొంటూ ఉంటాయి. ఎప్పటికన్నా ఇప్పుడు ఆ సంక్లిష్టత బాగా పెరిగింది. ఇలాంటి పరిస్థితిలోనే సమాజం గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత యువతపై మరింత ఎక్కువగా ఉంటుంది.

ప్రస్తుతం మనదేశ జనాభాలో సగం మంది యువతీ యువకులే! ఇది చాలా గొప్ప మానవ వనరు. సరైన పద్ధతిలో ఈ శక్తిని ఉపయోగిస్తే- దేశ ప్రగతికి ఇదొక గొప్ప అవకాశం. ఉన్నామా? తిన్నామా? మన బాగు మనం చూసుకున్నామా? అన్నది ఎప్పుడూ యువతరం జీవన విధానం కాదు. యువశక్తి... అంటే- అంతకుమించి. నవనవోత్తేజం ప్రవహించి... నవీన మార్పులను సృష్టించగలిగేంత స్ఫూర్తి. దేశానికి సరికొత్త వెలుగులు ప్రసరించేంత ప్రబల దీప్తి.

కాలం ఏదైనా కొత్త మార్పును తెచ్చే ఆలోచనలను, ఆచరణనూ సమాజం వెంటనే ఆమోదించదు. పాత భావాలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తుల నుంచి, వ్యవస్థ నుంచి ప్రతికూలత, ప్రతిఘటనా ఎదురవుతాయి. ఇది సహజమనే అవగాహన యువతరానికి ఉండాలి. ఇప్పుడు మనం స్వాతంత్ర్యోద్యమం గురించి ఘనంగా చెప్పుకుంటాం. అందులో పాల్గొన్న పెద్దలను గొప్పగా కీర్తిస్తాం. కానీ, ఆ సమయంలో వారికి సమాజం మొత్తం నుంచి, కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల నుంచి కూడా మద్దతు లభించలేదన్నది వాస్తవం. కొందరు స్వార్థంతోనో, అవగాహనాలేమితోనో అప్పటి పాలకుల భావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. మార్పు కోసం ప్రయత్నిస్తున్న వారికి వ్యతిరేకంగా సాగే ప్రచారంలో భాగస్వామ్యం వహిస్తారు.

వెలుగు దివ్వెలూ .. నిప్పురవ్వలూ

అల్లూరి సీతారామరాజుకు మన్యంవీరుడని పేరు. మన్యం ప్రజలపై బ్రిటీషు వారి దాష్టీకానికి వ్యతిరేకంగా 1922 – 24 మధ్య పోరాటం నడిపాడు. ఆరోజుల్లో ఆయన్ని దోపిడీదారు అన్నవారు ఉన్నారు. పోలీస్ స్టేషన్లో అలాంటి కట్టుకతలతోనే కేసులు పెట్టారు. ఆయనకు, ఆయన బృందానికి సహకరించకూడదని పరమ దారుణంగా గ్రామాలను భయపెట్టారు. చిత్రహింసలకు గురి చేశారు. కొందరు జాతీయ నాయకులు కూడా అప్పట్లో అల్లూరిని సమర్థించలేదు. స్వాతంత్ర్యం వచ్చాక పరిస్థితి మారింది. ఆయనిప్పుడు మన్యం గుండెల్లో దేదీప్య తార.

ఇది కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సంవత్సరం. తరతరాలకు ఆయనొక చెరగని స్ఫూర్తి సంతకం. బాల్య వివాహాలను అడ్డుకున్నాడు. ఊహ తెలియక ముందే వితంతువులుగా మారిన ఎందరికో పునర్వివాహాలు చేశాడు. వారికి ఆశ్రయం ఇచ్చాడు. ఆడపిల్లలకు చదువు నేర్పించాడు. ఆకాలంలో ఇదంతా సంప్రదాయ విరుద్ధమని, విలువలకు పాతరేసే మహా పాతకమని సాంప్రదాయ వాదులు నానా రభసా చేశారు. ప్రదర్శనలు జరిపారు. శాపనార్థాలు పెట్టారు. ఆయన వ్యక్తిత్వాన్ని హీనపరిచే కట్టుకథలను ప్రచారం చేశారు. భౌతిక దాడులకు పాల్పడ్డారు. కులం నుంచి వెలివేశారు. అయినా, అధైర్యపడలేదు కందుకూరి. మహిళల అభ్యున్నతే తన లక్ష్యం అన్నాడు. ఛాందస భావాలకు సమాధి కట్టటమే

తన సంకల్పమని చెప్పాడు. ఆయన తరువాతి కాలంలో సంఘ సంస్కర్తగా, నవయుగకర్తగా ప్రఖ్యాతి పొందారు. ఇప్పుడు బాల్యవివాహాలను ఎవరైనా అంగీకరిస్తారా? చిన్న వయసులో భర్త చనిపోయిన యువతులు మళ్లీ పెళ్లి చేసుకోవటాన్ని వ్యతిరేకిస్తారా? సమాజం కాలం గడుస్తున్నకొద్దీ తన భావాలను విస్తరించుకుంటుంది. ఎక్కువమంది వ్యతిరేకించినంతమాత్రాన కొన్ని దురాచారాలూ, అసమానత్వ భావాలూ మంచివి అయిపోవు. యువతీయువకులు ముందు కాలపు దూతలు. అందుకనే రేపటి సమాజం ఎలా ఉండాలో ఇప్పుడే ఆలోచించాలి. ఆ విధమైన మార్పు కోసం ఇప్పటినుంచే ప్రయత్నం చేయాలి. ఎంతమంది వ్యతిరేకించినా– రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం, జ్యోతిరావు బా పూలే వంటి మహానుభావులు తాము యువకులుగా ఉన్నప్పుడే తమ స్పష్టమైన బాటను, భావజాలాన్ని ఎంచుకున్నారు. ఆ బాటలో సమాజాన్ని నడిపించారు.

యువతకు తిరుగులేని ఉత్తేజం భగత్‌సింగ్. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో భయమెరగని వీరకిశోరం. ఉరితాడును వరమాలగా భావించిన 1931 నాటికి ఆయన వయస్సు కేవలం 23 ఏళ్లు! అంత చిన్న వయసులోనే స్పష్టమైన భావావేశం, దృఢమైన సంకల్ప బలం గుండెలనిండా నింపుకున్నాడు. భగత్ స్వీయరచనలు, లేఖలూ చదివితే– ఎంత నికరంగా ఉండేవాడో తెలుస్తుంది. తన క్షేమం కోరి తండ్రి రాసిన లేఖలో కొద్దిపాటి మెతకతనం ప్రదర్శించటాన్ని కూడా భరించలేకపోయాడు. క్షణక్షణం దేశం కోసం

పరితపించాడు. దేశ అభ్యున్నతికి ఏ మార్గం అవసరమో చాలా స్పష్టాతిస్పష్టంగా ఆ ఇరవై మూడేళ్లకే అవగాహనలోకి తెచ్చుకున్నాడు. ఇప్పుడు మతతత్వం రగిలించే కొన్ని శక్తులు భగత్‌సింగ్‌కు వారసులమంటూ చెప్పుకోవటం ఎంత హాస్యాస్పదమో ఆయన రచనలు చదివితే తెలుస్తుంది. భగత్‌సింగు, రాజగురు, సుఖ్‌దేవ్ జైల్లో ఉన్నప్పుడు, మరణశిక్ష పడినప్పుడు– అప్పటి ప్రధాన నాయకులు వారికి దన్నుగా నిలవలేదు. కానీ, కోట్లాదిమంది ప్రజల గుండెల్లో వారు వీరకిశోరాలుగా నిలిచారు. ఇప్పటికీ, ఎప్పటికీ ధైర్యంగా బిగించే పిడికిలి వెనక, నిర్భయంగా ప్రశ్నించే గొంతు వెనకా వారి స్ఫూర్తి ధ్వనిస్తూనే ఉంటుంది.

మార్పు ఒక నిరంతర ప్రక్రియ

సమాజం ఒక దశలోంచి ఒక దశలోకి నిరంతరంగా మారుతూ ఉంటుంది. మారుతున్న క్రమంలో పాత విలువలు కొన్ని నశించిపోతాయి. కొత్త విలువలు కొన్ని వచ్చి చేరతాయి. ఇది నెమ్మది నెమ్మదిగా జరిగే మార్పు. ఒకనాడు కాదన్నది ఇప్పుడు అవున వుతుంది. ఇప్పుడు అవున్నది కొంతకాలానికి కొరకాకుండా పోతుంది. అవసరాలను బట్టే చెల్లుబాటు ఉంటుంది. ఏ విలువా స్థిరంగా పాతుకొనిపోవటం కుదరదు. ఈ అంశాలను అర్థం చేసుకోవటానికి చారిత్రిక పరిశీలన, శాస్త్రీయ దృష్టి, సామాజిక దృక్పథం అవస రమ వుతాయి. ఇప్పటి వరకూ ఏం జరుగుతూ వచ్చింది? దీని వెనక గల శాస్త్రీయ, తార్కిక కారణాలు, సంబంధాలూ ఎలాంటివి? సామాజిక సంబంధాలూ, అవసరాలూ ఎలా నడుస్తున్నాయి? అన్న విశ్లేషణ ఉంటే– ప్రతి పరిణామం సులభంగానే అవగతం అవుతుంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెరిగినకాలంలో– ఈ అవగాహన పొందటం మరింత సులభం కూడా! కానీ, మోడర్న్ కాలాన్ని కూడా కొన్ని శక్తులు మూఢత్వ విస్తృతికి ఉపయోగిస్తున్నాయి. తార్కిక దృష్టికి నిలవని అబద్ధాలను భావోద్వేగాలను జతచేసి ప్రచారం చేస్తున్నాయి. కొంతమంది యువతీ యువకులు తెలుసో తెలియకో ఇలాంటి అజ్ఞాన సమాచారాన్ని నమ్మటం, ప్రచారం చేయటం బాధాకరమే!

ప్రతి కాలాన్ని మరింత మంచి కాలంగా మార్చే బాధ్యత మనందరిదీ! ముఖ్యంగా యువతది. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, సుందరయ్య లాంటి మహానుభావులు ఆశించిన దిశగా దేశాన్ని నడిపించటంలో మన పాత్రా ఉంటుంది. మనది భిన్నత్వంలో ఏకత్వం గల దేశం. భిన్న భాషలూ, భిన్న ప్రాంతాలూ, భిన్న సంస్కృతీ సంప్రదాయాలూ, భిన్న ఆచార వ్యవహారాలూ ... అన్నీ కలిస్తేనే భారతదేశం. మరి సమకాలీన పరిణామాలు ఆదిశగా ఉన్నాయా? మనుషుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయా? యువత గమనించాలి. చారిత్రిక దృష్టితో చూస్తే– సామాజిక పరిణామ క్రమాన్ని గమనిస్తే, కులం అనేదానికి ప్రాధాన్యం లేదు. ఆ పేరిట కొందరు ఆధిక్య భావనకు గురవ్వడం, కొందరిని కించపర్చటం, కులాల పేరిట స్నేహాలూ గుర్తింపూ కోరుకోవటం ఆటవిక లక్షణం కన్నా అధమం. కులాన్ని కెలుక్కోవటానికి ఇంటర్నెట్‌ని వాడితే– అది ఆధునికం అనిపించుకోదు. ఇలాంటి విషయాల్లో యువతలో రెండు రకాల ధోరణులు కనిపిస్తాయి. అందరం ఒకటే అనే తరహా ఒకటి కాగా, తక్కువ

ఉద్ఘాటించాడు మహాకవి గురజాడ. వాస్తు, జ్యోతిష్యం వంటివి ఇంతగా అభివృద్ధి చెందని కాలంలో ప్రజలకు కొంత ఉపయోగపడ్డ మాట నిజమే! ఇప్పుడు సైన్సు అండ్ టెక్నాలజీ అంతకుమించి అభివృద్ధి చెందింది. ఇంకా వాటిని పట్టుకొని వేలాడ్డంలో ఔచిత్యం లేదు. కొందరు పాత నమ్మకాల్లో ఏదో అంతరార్థం ఉందంటూ సైన్సుని గుప్పించి, చెబుతూ ఉంటారు. ఆ కబుర్లు

ఎక్కువల విభజనతో కుల సమీకరణలు కోరుకునే ధోరణి మరొకటి. కారణం ఏది చెప్పుకున్నా - ఇలాంటి విభజనతో సమూహాలు ఏర్పడ్డం సమాజానికి హానికరం.

సమానత్వం దిశగా ...

స్త్రీ పురుష సమానత్వం సాధించే దిశగా గతంలో ఎంతోమంది ఎన్నో ప్రయత్నాలు చేశారు. వాటి ఫలితమే ఇప్పుడు మనం చూస్తున్న ఈపాటి మార్పు. ఇదింకా ముందుకు వెళ్లాలి. కట్నాలు తీసుకోని యువకులు ఈమధ్యకాలంలో చాలా పెరిగారు. కానీ, ఆ సంఖ్య ఇప్పటికీ అత్యల్పమే! ఆ భావజాలం ఇంకా విస్తృత ప్రచారం పొందాలి. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మాట్లాడ్డం, వ్యవహరించటం బాగా పెరగాలి. కానీ, ఈకాలంలో సైన్సునీ, చాదస్తాన్ని కలగలిపి మాట్లాడేవారు పెరిగారు. మనం గొప్పవాళ్లం అని చెప్పుకోవటానికి మన గతమంతా ఘనమైనదేనని జబ్బలు చరుచుకోవటం మంచిది కాదు. తార్కిక దృష్టితో చూస్తే మంచిచెడ్డలు రెండూ విడివిడిగా బోధపడతాయి. గతంలో మంచి కొంచెమేనని, రానున్నదే మంచికాలమని వందేళ్లనాడే

చెప్పటానికి మళ్లీ ఈనాటి టెక్నాలజీతో కూడిన టీవీలూ, ల్యాప్‌ట్యాపులూ ఉపయోగిస్తుంటారు. దీనినిబట్టే అందులోని డొల్లతనం బట్టబయలు అవుతుంది.

పార్టీల గుట్టు .. ప్రభుత్వాల పట్టు తెలియాలి

ఎన్నికల హామీలూ, రాజకీయ పార్టీల ప్రచారాలూ, అందులోని వాస్తవాలూ ఏమిటో ... యువతరం బాగా అవగతం చేసుకోవాలి. మాటలకు, చేతలకు పొంతన ఉందా? చెప్పిన కబుర్లలో సాధ్యమయ్యేది ఎంత? గతంలో చెప్పిందేమిటి? చేసిందేమిటి? వంటి విషయాలను స్వీయ పరిశీలనతో అధ్యయనం చేయాలి. ఆ పని నేడు చాలా సులభం. కంప్యూటర్ల సాయంతో క్షణాల్లో సమాచారాన్ని పొందొచ్చు. ఎవరో రాసిన వ్యాఖ్యలను, లెక్కలను యథాతథంగా నమ్మకుండా వాస్తవాలతో బేరీజు వేసుకోవాలి. ఎవరు ఏ పని చేసినా, ఎంత సంపాదించినా, ఏ ఉద్యోగంలో ఉన్నా - అందరిపైనా మన ప్రభుత్వాల పనితీరు ప్రభావం తప్పనిసరి. రాజకీయాలు మాకొద్దు అని విరక్తినో, విముఖతనో ప్రదర్శించటం సరైంది కాదు. కాబట్టి- రాజకీయ వ్యవస్థలను దగ్గరగా

దేశానికి ఇంధనం యువతే!

దేశంలో దాదాపు 16 శాతం నిరుద్యోగం ఉంది. గొప్ప శక్తియుక్తులు ఉన్న 30 ఏళ్లలోపు యువతరం చదువుకు తగ్గ ఉద్యోగాలు లేక నానా తిప్పలూ పడాల్సి వస్తోంది. పెద్ద పెద్ద ప్యాకేజీల గురించి పత్రికల్లో ఘనమైన వార్తలు వచ్చినా- నిజానికి అలాంటి జీతాలు పొందుతున్న వారి సంఖ్య 3 శాతానికి మించటం లేదు. ఎక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తున్న సాఫ్ట్‌వేర్ వంటి రంగాల్లో పనిఒత్తిడి, పనిగంటలు దారుణంగా ఉంటున్నాయి. ఉద్యోగం ఎప్పుడు పోతుందో, జీతానికి ఎంత కోత పడుతుందోనన్న భయం సీనియర్లను సైతం వెంటాడుతోంది. ఇలాంటి సమస్యలపై 150 ఏళ్ల క్రితమే సాధారణ కార్మికులు సంఘటితమై పోరాడారు. చాలా సదుపాయాలు సాధించుకున్నారు. ఇప్పుడు అలా ప్రశ్నించే పరిస్థితే లేకపోవటం నిజంగా అభివృద్ధేనా? ఇలాంటి అంశాల్లో అమెరికా, ఫ్రాన్స్, ఐరోపా దేశాల్లోని యువత ఈ మధ్యకాలంలో తీవ్రంగా గొంతెత్తుతోంది. మన దగ్గర ఇది ఇంకా రావాల్సిన మార్పు.

పరిశీలించాలి. అభిమాన దురభిమానాలను పక్కన పెట్టి- మన దేశానికి, ఆధునిక కాలానికీ తగినట్టుగా ప్రభుత్వాలూ, పార్టీలూ నడుస్తున్నాయో లేదో చూడాలి. రాజకీయాల్లో సంపన్నులూ, కార్పొరేట్ శక్తులూ పెరిగే కొద్దీ - సామాన్యులకు అందే పథకాలూ, ప్రయోజనాలూ తగ్గిపోతాయి. బలహీనంగా ఉండే రైతులు, దళితులు, గిరిజనులు, అన్ని తరగతుల పేదలకు కేటాయింపులు కుంచించుకుపోతాయి. వీటిని పరిశీలించి, ప్రజలకు చెప్పటం కూడా యువతరం పనే! 'మా డబ్బుతో మేం చదివాం. మా కృషితో మేం ఎదిగాం. మాకు ఈ సమాజంతో సంబంధం లేదు.' అని యువతను వేరు చేయడం ప్రయివేటు విద్య లక్షణం. ఎక్కడ చదివినా, ఎలా ఎదిగినా మనమంతా సామాజికులం. సంబంధీకులం. సమాజం గురించి పట్టించుకోవటం ఎప్పటికీ బాధ్యతే!

యువతరం దేశానికి ఇంధనం. ప్రగతికి ముందు చక్రం. ఇందులో ఏ సందేహమూ అక్కర్లేదు. చరిత్రలో ఏ మార్పు సంభవించినా అది ఉరకలెత్తే యువత వల్లే సాధ్యమైంది. 'యువతరం శిరమెత్తితే.. నవతరం గళమెత్తితే- చీకటే పారిపోదా? లోకమే మారిపోదా?' అన్న కవి ఆశాభావం అత్యాశ కాదు. అది గతంలో జరిగింది. భవిష్యత్తులోనూ జరుగుతుంది. అయితే, దానికి వర్తమానంలోని యువతరం ఎలాంటి ఆచరణ చేపడుతుంది అన్న దానిపై ఆ మార్పు దిశా, దశా ఆధారపడి ఉంటాయి. కాలమైతే- మంచిమార్పునే కలగంటూ ఉంటుంది ఎప్పుడూ. దానిని నిజం చేసే బాధ్యత గల యువతీయువకులు కావాలిప్పుడు. ★

డిజిటల్ కన్ను

'సో' స్మార్ట్

ఇంట్లో మన వ్యక్తిగత గదిలో సొంత మొబైల్‌లో ఏం చేసినా, ఎవరికి తెలుస్తుందిలే అనుకుంటే మీరు చిక్కుల్లో ఉన్నట్టే మరి. తలుపులు వేసుకొని, లైట్స్ ఆఫ్ చేసుకొని నియమాలకు విరుద్ధంగా సామాజిక మాధ్యమంలో చేసే పనులు మీ ఇంట్లో వారు కనిపెట్టలేక పోవచ్చు కానీ సైబర్ బ్రాంచ్ మాత్రం మనం వేసే ప్రతి అడుగును బహిర్గతపరుస్తోంది. సామాజిక మాధ్యమాలలో చేసే ప్రతి పనిని తెలుసుకునే అవకాశం సాంకేతికంగా ఉంది.

ముసుగులో ఉంటూ..

మన భావాలు నేరుగా మనమే వివిధ సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడం ద్వారా ఎలాంటి వ్యక్తిత్వం ఉన్నవారమో అందరికి తెలుస్తుంది. అయితే ముసుగులు వేసుకున్న వారూ లేకపోలేదు. పెట్టే పోస్టులు ఉత్తమమైనవీ, అందరికీ ఆమోదయోగ్యమైనవీ, సమాజ హితమైనవిలా ఉంటాయి కానీ వారి ఆలోచనలు అందుకు విరుద్ధంగా ఉంటాయి. అలాంటి వారిని కనిపెట్టడం అంత సులువేమీ కాదు. అయినా ముసుగులు వేసుకున్న వారు, నటించే వారు



ఏదో ఓ రోజు ఒక చిన్న పొరపాటుతో దొరికిపోతారు. ఈ మధ్యకాలంలో చాలామంది వారికి నచ్చినట్టు కామెంట్స్ పెట్టడం, వ్యక్తులను కామెంట్స్ ద్వారా కించపరచడం మనం చూస్తూనే ఉన్నాం. కొంతమంది కామెంట్ పెట్టి కాసేపటికే డిలీట్ చేస్తారు. వాస్తవానికి ఆ కామెంట్ కనపడదని భ్రమపడుతుంటారు. కానీ, మీరు పెట్టే కామెంట్, లైక్, ఎమోజీ ఏదైనా డిజిటల్ ఫుట్ ప్రింట్ సేకరిస్తుందనే విషయం తెలుసుకోండి. అందుకే ఒకటికి పదిసార్లు ఆలోచించే సామాజిక మాధ్యమాలలో పోస్టులు, కామెంట్స్, లైక్స్ చేస్తూ ఉండాలి.

మోసపోతూనే..

సెక్స్ సీకర్స్ ఎక్కువగా అమ్మాయిల ఫొటోలతో వల్గర్ పోస్టులు సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ ఉంటారు. ఆ పోస్ట్‌కి వల్గర్ కామెంట్స్‌ని పెట్టమని కోరుతూ ఉంటారు. కొందరైతే అమ్మాయిల ఫోన్ నంబర్లని బహిర్గతం చేస్తున్నారు. మరికొందరు అమ్మాయిల ఫోన్ నంబర్లని డబ్బులు పెట్టి కొంటున్నారు. డిజిటల్ వేలట్ల ద్వారా డబ్బులను దోచేస్తున్నారు. వారిచ్చిన నంబర్స్‌కి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంటుంది. ఈ విధంగా మోసపోయేవారూ ఉన్నారు. మోసపోయామనే విషయాన్ని తెలిసి కూడా ఏమి చేయలేని పరిస్థితిలో ఎందుకు ఉన్నారంటే చేసేది తప్పు అని తెలిసి చేస్తున్నారు. అందుకే మోసం చేసేవారిని పట్టుకోలేకపోతున్నారు. ఏ మాత్రం సామాజిక స్పృహ అంటూ ఉంటే చేసిన తప్పును తెలుకుని వారు ఏ విధంగా మోసపోయారో సైబర్ పోలీసులకు తెలియపరిస్తే వారిలాగా మరికొందరు మోసపోకుండా ఉంటారనేది గ్రహించాలి.

ఫేక్ ఐడితో ముప్పు

ఈ మధ్య చాలామందికి ఫేస్ బుక్ ఐడిలు ఒక్కొక్కరికి రెండు, మూడు అంతకు మించి కూడా ఉంటున్నాయి. ఒరిజినల్ ఐ.డితో పోస్ట్ చేసినా డూప్లికేట్ లేదా ఫేక్ ఐ.డితో పోస్ట్ చేసినా సమాచారం ఏ ఐ.పి అడ్రస్‌తో పోస్ట్ అయినదనే విషయాన్ని కనుక్కోవచ్చు. దీనిని డిజిటల్ ఫుట్ ప్రింట్ అంటారు. డిజిటల్ ఫుట్ ప్రింట్ ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి 'ప్యాసివ్ ఫుట్ ప్రింట్' మరొకటి 'యాక్టివ్ ఫుట్ ప్రింట్'. దీని ద్వారా ఓ వ్యక్తి పోస్ట్ చేసిన సమాచారం ఎక్కడ నుంచి ప్రారంభం అయ్యిందని కనిపెట్టవచ్చు. అంటే సోర్స్ ఎక్కడ ప్రారంభమైందో, ఎక్కడెక్కడ వైరల్ అయ్యి సామాజిక మాధ్యమాల్లో తిరుగుతోందో, దానివల్ల సమాజానికి ఎలాంటి చేటు కలుగుతోందో, కనిపెట్టి చర్యలు తీసుకుంటారు. కాబట్టి పెట్టిన పోస్ట్ ద్వారా దొరకదని అనుకుంటూ ఉంటే అది



సొంత గదిలో స్మార్ట్ ఫోన్‌ల్లో ఏమి చేసినా వేరేవాళ్లకు తెలిసే ఆస్కారమే లేదనుకుంటున్నారా? మన ఇంట్లోనే ఉంటూ సామాజిక మాధ్యమాల్లో మనమెలా ఉన్నామనేది మన కుటుంబానికి తెలుస్తుందో లేదో కానీ మన మనసులో ఏ ఆలోచనలతో మెదులుతున్నామో ఇట్టే తెలిపే సాంకేతిక పరికరాలూ ఉన్నాయి. అదెలా సాధ్యం అనుకుంటున్నారా? పదండీ తెలుసుకుందాం..



మూర్ఖత్వామే అవుతుంది. ఫేక్ ఐ.డితో పోస్ట్ చేసినా ఐ.పి అడ్రస్‌తో సహా క్రైమ్ బ్రాంచి వారు పట్టుకుంటారని మర్చిపోవద్దు.

బేస్ అడ్రస్‌లో భద్రం

ఈ డిజిటల్ ఫుట్ ప్రింట్‌తో పోస్ట్ చేసిన విషయమే కాదు, దానిపై వచ్చిన కామెంట్స్, యాక్షన్స్ అంటే లైక్స్, డిస్ లైక్స్ ఎవరెవరు ఎలాంటి ఎమోజిస్‌తో స్పందించారనేదీ కనుక్కోవచ్చు. తెలియకుండా లైక్ చేసినా అది నేరమే అవుతుంది. అందుకే ఏదో మనకు తెలిసినవారని పోస్ట్ చూడకుండా లైక్ చేసినా తప్పించుకోలేరు. కావున, పోస్ట్ చూసిన తర్వాతే స్పందించాలి. వాస్తవానికి ప్యాసివ్ డిజిటల్ ఫుట్ ప్రింట్స్‌ని 'హిట్' అనే బేస్ అడ్రస్‌లో భద్రపరుస్తారు. దాని ద్వారా ఏ ఐ.పి అడ్రస్ నుంచి పోస్ట్ చేశామో తెలిసిపోతుంది. ఎవరు పోస్ట్ చేశారు, ఎవరెవరు సర్క్యులేట్ చేశారనే విషయాలు మొత్తం ప్యాసివ్ డిజిటల్ ప్రింట్‌లో కనుక్కోవచ్చు. మీ ఎలక్ట్రానిక్ పరికరంలో ఏమేమి చేశారో ఇట్టే తెలిసిపోతుంది. అదే యాక్టివ్ డిజిటల్ ప్రింట్‌లో అయితే మీ పరికరం EMI

నెంబర్, అది ఏ ప్రాంతం నుంచి యాక్సెస్ అయ్యింది? ఆ పరికరానికి ఓనర్ ఎవరు? ఇందులో అవసరమైతే సామాజిక మాధ్యమాల పాస్‌వర్డ్‌నూ కనుక్కోవచ్చు. అప్పుడు ఎవరెవరితో సంభాషణ చేశారు, స్నేహితుల జాబితా, సామాజిక మాధ్యమాలు ఉపయోగించి మాట్లాడిన ఫోన్ సంభాషణలూ బయటపడతాయి.

ప్రతిదీ రికార్డు

ప్రతి సైట్‌కి ముందు వరల్డ్ వైడ్ వెబ్ (www) అని ఉంటుంది. దీనివల్ల మీరు బ్రౌజర్‌లో ఎలాంటి సమాచారం బ్రౌజ్ చేశారనే విషయాన్నీ సేకరించి కుకీస్ రూపంలో స్టోర్ చేస్తూ ఉంటుంది. తరచూ హిస్టరీ డిలీట్ చేసినా అది కేవలం ఫోన్ లేదా కంప్యూటర్‌లో మాత్రమే కనపడకుండా పోతుందనే విషయాన్నీ మర్చిపోకండి. ఆన్‌లైన్‌లో బ్రౌజ్ చేసే ప్రతి విషయం మూడో కన్ను చూస్తోందని గమనించుకోండి. మీ పరికరాలలోని సెన్సార్లు చేసే ప్రతి యాక్టివిటీని రికార్డు చేస్తూ ఉంటాయి. అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించి నిజా నిజాలను సైబర్ క్రైమ్ వారు తెలుసుకుంటారు.



కటకటాల వెనక్కే..

ఇంత పటిష్టమైన భద్రత ఉన్నా సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకరమైన పోస్టులు కనపడుతూనే ఉంటున్నాయి. దీనికి ఒకటే కారణం ఓ పని చేయడం వల్ల ఎలాంటి సమస్యలను ఎదుర్కోబోతున్నారో తెలియకపోవడమే. చేతిలో ఫోన్ ఉంది కదా! అందులో ఇంటర్నెట్ ఉంది కదా! నేను ఎన్ని ఐ.డిలు అయినా క్రియేట్ చేసుకొని సమాజానికి విరుద్ధమైన పనులు చేస్తానంటే తప్పు దోవలో వెళ్తున్నారనే అర్థం. సాంకేతిక అభివృద్ధిని వీలైతే ఎదుగుదలకు ఉపయోగించుకోవాలే తప్ప ఎదుటివాళ్లను ఇబ్బంది పెడుతూ ఎవరికీ తెలియదనుకుంటే కటకటాల వెనక్కి వెళ్ళడానికి సిద్ధపడుతున్నారన్నమాట.

ఈ డిజిటల్ ఫుట్ ప్రింట్ వల్ల సమాచారం మొత్తం బహిర్గతం అవుతోందనే వాదనా ఉంది. ఎలాంటి తప్పు చేయని వారి వ్యక్తిగత వివరాలు ఎందుకు మానిటర్ చేయాలి? ఎవరో కొందరు తప్పు చేస్తే అందరి సమాచారం తెలుసుకోవడమేంటి? అని వాదిస్తున్నారు. ఏది ఏమైనా మనం నిజాయితీగా ఒకరిని ఇబ్బంది పెట్టకుండా ఉంటే ఇలాంటి ఎన్ని రకాల రికార్డులు ఉన్నా భయపడాల్సిన అవసరమే లేదనేది గ్రహించాలి.

- నిజాగ్ని



వెలుగుల నగరం పారిస్

యమహా నగరీ

పారిస్ క్రీపూ. 250లో స్థాపించబడినది. పరిసీ ఉపజాతి సెల్టిక్ సినోన్స్, తొలిగా వారు 'ఐల్ డా లా సిటే'లో స్థిరపడ్డారు. నీటి సముదాయాల్లో ఎక్కువగా ఉండే వీరి పేరు మీద ఆ నగరానికి పేరు వచ్చింది. 15వ శతాబ్దం చివరి నుంచి17వ శతాబ్దం వరకు ఫ్రెంచ్ పునరుజ్జీవన కాలంలో, పారిస్ కళ, నిర్మాణం విజ్ఞాన కేంద్రంగా మారింది. 1940 నుంచి 1944 వరకు, పారిస్ నగరాన్ని జర్మన్లు ఆక్రమించారు. 1942 నాటికి, ఫ్రెంచ్ యూదులను భారీగా బహిష్కరించారు. 1944 నాటికి పారిస్ నగరం మిత్రరాజ్యాల దళాలచే విముక్తి పొందింది. ఫ్రాన్స్‌కి పలు కాలాల్లో పారిస్ రాజధానిగా మారి చివరకు 1944 విముక్తి తర్వాత స్థిరపడింది. క్రీ.శ. 900-1419, 1428-1588, 1594-1682, 1715-1722, 1789-1871, 1879-40 ఇలా రాజధానిగా ఉంది. సంవత్సరానికి 2 కోట్ల మంది సందర్శకులు ఈ నగరానికి పర్యాటక, వ్యాపార, పరిశీలన నిమిత్తం వచ్చిపోతుంటారట. 2016 నాటికి పారిస్‌లో జనాభా దాదాపు 23 లక్షలు. పశ్చిమ యూరప్ దేశాల్లో అతి తక్కువ ఖర్చు, నాణ్యతతో కూడిన నగర జీవన విధానంలో పారిస్ 2వ స్థానంలో ఉంది. ప్రపంచంలోని 326 దేశాల్లో 32వ స్థానంలో ఉంది. సామాజిక ఉద్యమాలు, సాంస్కృతిక విప్లవాలు, కళలు, సాహిత్యానికి ప్రపంచ కేంద్ర బిందువైన పారిస్ గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందామా..!

- అసలు పారిస్ లైట్స్ నగరమని ఎందుకు పిలుస్తారో తెలుసా? 1860ల్లో యూరోపియన్ నగరాల్లో గాలి, గ్యాస్ వీధి దీపాలతో మొట్టమొదట వెలుగులతో మెరిసింది పారిస్. దీపాల వెలుగులో 56,000 వీధులు ప్రకాశించాయట. మరో కారణం పారిస్ నగరానికి తరలి వచ్చిన రచయితలు, కళాకారులు, విద్యావేత్తలు, మేధావుల వల్ల కూడా ఆ పేరు వచ్చిందట.
- 1871 మార్చి 18 నుంచి మే 28, వరకు ఫ్రెంచ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పారిస్ తిరుగుబాటు చేసింది. దానినే 'పారిస్ కమ్యూన్' లేదా 'లా కమ్యూన్ డి పారిస్' (La Commune de Paris) గా పిలుస్తారు. ఇది ఫ్రాంకో-జర్మన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఓటమి నేపథ్యంలో నెపోలియన్ క్ష్మ్రక్ష్మ్రక్ష్మ్ర (1852-70) రెండవ సామ్రాజ్యం కూలిపోయిన తర్వాత చేశారు.
- ఫ్రెంచి ఓపెన్ గ్రాండ్ స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఆతిథ్యం అందించింది పారిస్. 1900ల్లో, 1924లో ఒలింపిక్స్‌కి ఆతిథ్యం ఇచ్చింది. రాబోయే 2024 సమ్మర్ ఒలింపిక్స్‌కి ఆతిథ్యం ఇవ్వనుంది. పారిస్‌లో 1998 ఫిఫా ప్రపంచ కప్, 2007లో రగ్బీ ప్రపంచ కప్, 1960, 1984, 2010 (యుఇఎఫ్ఎ) యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ చాంపియన్‌షిప్‌ని పారిస్‌లోనే ముగించారు. 1998 ఫిఫా ప్రపంచ కప్ కోసం 80,000 మంది జనాభా పట్టే స్టేడియాన్ని ఆ నగరంలో కట్టారు.
- డాడా ఉద్యమంలో సిద్ధాంతపరమైన, సాహిత్యపరమైన, చిత్ర కళలకు సంబంధించిన వారిలో ఎర్నెస్ట్ హెమింగ్వే, జేమ్స్ జాయిస్, జేమ్స్ బాల్డ్విన్, సాల్వడోర్ డాలీ, పాబ్లో పికాసోలను పారిస్‌కు చెందిన రచయితలు, కళాకారులు 'లాస్ట్ జెనరేషన్'గా గుర్తించారు. అందుకే 1920, 1930ల్లో పారిస్ కళలను, సాహిత్యంలో ప్రపంచ ప్రఖ్యాత కేంద్రాల్లో ఒకటిగా గుర్తించబడింది.
- మ్యూసిడి ఓర్సే అనేది పారిస్‌లోని ఓ జాతీయ మ్యూజియం అంతర్జాతీయంగా ఇంప్రెషనిస్ట్ కళా సేకరణకు ఈ మ్యూజియం ఎంతో ప్రసిద్ధి చెందింది.
- ప్రపంచంలోనే అత్యంత అందమైన చెట్లున్న వీధి 'అవెన్యూ డెస్ చాంప్స్-ఎలీసేస్'.
- ఈఫిల్ టవర్‌ను అలెగ్జాండర్-గుస్తావ్ ఈఫిల్ రూపొందించాడు. 1889 నాటి పారిస్ ఎగ్జిబిషన్ కోసం నిర్మించారు. ఈ టవర్లో 15,000 ఉక్కు విభాగాలు ఉన్నాయి, ఇందులో 2.5 మిలియన్ రివెట్లు ఉన్నాయి. ఎగ్జిబిషన్ అంనంతరం దాన్ని కూల్చివేయాలని అనుకున్నారు!
- పారిస్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన కళా మ్యూజియం లావ్రే. 'లియోనార్డో డా విన్సీ' అనే గొప్ప చిత్రకారుడు కనుబొమ్మలు లేని ప్రపంచ సుందరి మోనాలిసాని వేసిన పెయింటింగ్ ఆ మ్యూజియంలోనే ఉంది.
- నోట్రే-డామ్ కేథడ్రాల్ పారిస్‌లోని 'ఐల్ డి లా సిటే'లో ఉంది. ఇక్కడ కేథడ్రల్ ఫ్రెంచ్ గోతిక్ ఆర్కిటెక్చర్ అత్యుత్తమ కట్టడాల్లో ఒకటి. ప్రపంచంలోని అతిపెద్ద చర్చి భవనాలలో ఒకటి. దీన్ని 1163-1345 మధ్య నిర్మించారు. సంవత్సరానికి దాదాపుగా కోటి మప్పై లక్షల మంది సందర్శిస్తుంటారట. ఆ కట్టడాన్ని చూడటానికి ఎందరో ఆర్కిటెక్చర్లు వెళ్తుంటారు.
- పారిస్‌లో విశ్వవిద్యాలయం స్థాపన రెండు దశలుగా జరిగిందట. ఒకటి 1215లో రెండోది 1253లో.



విహారం

సాహస యాత్రికులతో ప్రతి ఏటా ఎక్కువ రద్దీగా ఉండే ప్రాంతం బాలి. ఇక్కడి ప్రధాన పర్యాటక ఆకర్షణల్లో ఇప్పుడు బాలి స్వింగ్ చాలా ఫేమస్. బొంగ్‌కసా పెర్టివి, కపుబాటెన్ బన్దుంగ్‌లాంటి ప్రధాన టూరిస్టు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఈ అతిపెద్ద ఊయలలు ఇప్పుడు డేర్‌డెవిల్స్‌ని ఆకట్టేసుకుంటున్నాయి. అటవీ ప్రాంతాల్లో పచ్చని చెట్ల మధ్యన 10, 15, 20 మీటర్ల ఎత్తున వీటిని ఏర్పాటుచేస్తుంటారు. ఈ భారీ ఊయలల్ని ఊగేందుకు పోటీలు కూడా జరుగుతుంటాయి. వీటిలో దాదాపు 78 మీ. ఎత్తున ఉన్న ఊయలలు కూడా ఉంటాయి. ఇప్పుడు బాలిలోని వనాగిరి స్వింగ్, ఉబుడ్ స్వింగ్, బాస్ ది అటయానా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఊయలలన్నీ అత్యంత ప్రజాదరణ పొందేస్తున్నాయి. రకరకాల సుగంధపు మొక్కలు, కాఫీ తోటలతో ఆగ్రో టూరిజమ్ స్పాట్‌గా పేరొందింది బాస్ ది అటయానా. పచ్చని ప్రకృతి మధ్యన హృదయాకారంలో ఇక్కడొక అందమైన నిర్మాణం ఉంది. ఇందులోనే ఒక ఊయలని కూడా ఏర్పాటు చేశారు. బాలీలోని సిబాటు ప్రాంతంలో ఉన్న ఈ వనాన్ని అత్యధికమంది సందర్శించడానికి ఈ ఊయల కూడా ఒక కారణం. అయితే ఇక్కడ ఎలాంటి ప్రవేశ రుసుమూ లేదు.

ప్రపంచం అంచుని తాకి

ఈక్వెడార్‌లోని బనోస్ హైకింగ్‌కు పేరొందిన ప్రదేశం. బలావిస్ట అడవుల్లో మూడు కిలోమీటర్ల హైకింగ్ యాత్రలో ఒక వ్యూ పాయింట్ వద్ద ఈ యాత్ర ముగుస్తుంది. అక్కడి నుంచి కనుచూపు మేరలో ఉంటుంది లా కసా డెల్ అర్బోల్. ఇదొక పేరొందిన ట్రీ హౌస్. ఆ ట్రీ హౌస్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన ఊయలే సాహసాలకు పెద్ద వేదికయ్యింది. సముద్ర మట్టానికి దాదాపు 2600 మీ. ఎత్తున ఉండే ఈ ఊయలపై నుంచి ఊగడం నిజంగా ఒక సాహసమనే చెప్పాలి. ఎడ్రినల్ జంకీస్ (సాహస యాత్రికులు) ఈ ఊయల విన్యాసాలని తెగ ఇష్టపడుతున్నారు. ఈ ట్రీ హౌస్‌కు దగ్గరలో మరికొన్ని ఉయ్యాలల్ని ఏర్పాటు చేశారు. ఇవన్నీ కాసేపు

సేదతీరటానికి ఏర్పా
ఊయలలనుకుంటే
మీ తెగువకు సవాలు
కాదు ఇలా ఊయల
ఉన్న టంగ్యురాహు
వీక్షించవచ్చు. పిల్లల
జిప్‌లైన్ మార్గాలు ఉ

సముద్ర

గిలి ద్వీపాల్లో
ఎప్పుడూ పర్యాటకుల
ఇక్కడ స్నోర్కెలింగ్ చ
స్వచ్ఛమైన నీటి ద్వారా
వీక్షించేందుకు జులై న
ఎక్కువమంది ఈ ద్వీ
ఈ ప్రాంతానికి పార్టీ
స్థిరపడింది. ఇక్కడ
రంగు సూర్య కాంతు
ఉంటాయి. అయితే
ఊయల ఊగే వారితే
మారుతోంది. గిలిలోని
ఏర్పాటుచేసిన ఈ ఊ
సూర్యాస్తమయాల్లో స
ఉయ్యాలలూగుతూ
చేసేసుకుంటూ సెల్ఫీ
పోటీపడుతున్నారంతా

ఉ

శాన్‌ఫ్రాన్సిస్కోలో
పార్క్ చాలా ఫేమస్.
ఏర్పాటుచేసిన ఈ పా
వీక్షించగలం. అంతే
కూడా ఉంది. బిల్లీగో
చెట్టుకొమ్మకు ఈ ఊ
ఊయలపై ఊగేస్తూ
పనే. ఈ ఊయలతో
ఎడ్వెంచరస్ స్పాట్‌గా
ఉన్న చెట్టుకొమ్మన
దిగేసేందుకు ఇక్కడి
నుంచి కూడా ఇక్కడి
సదుపాయం కూడా
కాస్త ఎక్కువే. అంతే
చాలా సార్లు కొందర
వత్తితేవడంతో దాన్ని
సార్లే జరిగాయి. అ
అభిమానులే దీన్ని
తొలగించే పనిని వి

నది మధ్యన ఉ
నార్వేకు ప్యాకప్ అ
ఇలాంటి ఒక సాహ
నార్వేలోని మొరాగ్
దూరంలో ఓ చిన్న

టు చేసిన
ురు పొరబడినట్టే. ఇవి
ా ఉంటాయి. అంతే
ఊగుతూ ఇక్కడికి దగ్గరలో
ాగ్ని పర్వతాన్నీ దగ్గరగా
కోసం ప్రత్యేకంగా కొన్ని
ర్నాయి.

పు ద్వీపాల్లో..

ట్రవాంగన్ ద్వీపం
తో రద్దీగా ఉంటుంది.
ాలా ఫేమస్. ఇక్కడి
సముద్ర జీవాల్ని
ుంచి డిసెంబర్ మధ్య
ానికి వస్తుంటారు. అలా
ఐల్యాండ్ అనే పేరు
ాయంత్రాలు బంగారు
లతో ఎంతో అందంగా
ప్పుడు ఈ ప్రదేశం
అత్యంత రద్దీగా
హోటల్ ఒమ్బాక్ సన్సెట్
యలలో
ముద్రపు అంచుల్ని తాకుతూ
ంగారు వర్ణాన్ని బ్యాగ్రౌండ్‌గా
లు దిగేందుకు తెగ
.

ఊరిని వీక్షించొచ్చు

ని ప్రధాన పార్కుల్లో బిల్లి గోట్ హిల్
బిల్లిగోట్ హిల్ పైభాగంలో
ార్క్ ఒక చివర నుంచి నగరం మొత్తాన్నీ
కాదు, ఇక్కడ ఒక పురాతన ఊయల
ట్ కొండ చివరంచున ఒక ఎత్తైన
యల్ని ఏర్పాటు చేశారు. అలా ఈ
నగరాన్ని వీక్షించడం సాహసోపేతమైన
ఇప్పుడు బిల్లిగోట్ హిల్ పార్క్ ఒక
ానూ మారింది. ఇలా కొండ చివరంచున
ఊగేస్తూ ఊరిని చూస్తూ సెల్ఫీలు
స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రదేశాల
కి వస్తుంటారు. టాప్ పార్కింగ్
ఉండటంతో ఈ పార్క్‌కు విజిటర్స్ తాకిడీ
కాదు ఈ ఊయలని తొలగించాలంటూ
స్థానికులు పార్కు యాజమాన్యంపై
తీసేశారు. ఇలాంటి ప్రయత్నాలు చాలా
యితే, ఈ ఊయల తెగిపోయిన ప్రతిసారీ
కట్టేస్తుండంతో ఇక చేసేదిలేక దాన్ని
రమించుకున్నారట.

ోషల్ మీడియాతోనే ...

ుయ్యాల ఊగే తెగువ మీకుందా అయితే
్వండి. ఎందుకంటే హజొరన్డ్ జొర్డ్ స్వింగ్
సోపేతమైన అనుభవాన్ని అందిస్తుంది.
రోమ్సడల్ నగరానికి నాలుగు కిలోమీటర్ల
ఊరు అలెసన్డ్. కేవలం ఒక ఫెర్రీ మార్గం
ద్వారానే ఈ ఊరికి చేరుకోగలం. అలా పచ్చని పొలాల మధ్య కొంతదూరం నడుచుకంటూ ముందుకు సాగితే మార్గం మధ్యలోనే అత్యంత పొడవైన కొబ్బరి చెట్లు కనిపిస్తాయి. ఆ చెట్లకొమ్మలకి కొన్ని ఊయలలు కట్టి ఉంటాయి. వీటిలో హజొరన్డ్ జొర్డ్ స్వింగ్ చాలా ఫేమస్. ఇక్కడి చేరుకోడానికి మరో ప్రత్యామ్నాయ మార్గం హైకింగ్. సులువైన హైకింగ్‌లో రెండు గంటల్లో ఈ ప్రాంతానికి చేరుకోగలం. ఓ పక్క పచ్చని పొలాలు, మరో పక్క ఎత్తైన కొండలు వీటి మధ్యన ఊయలూగుతూ ఇక్కడి ప్రకృతి అందాల్ని ఆస్వాదించాలంటే ముందుగా అనుమతుల్ని తీసుకోవాలి. తొలినాళ్ళలో ఈ ప్రదేశం గురించి తెలిసింది కూడా అతికొద్దిమందికే. అయితే సోషల్ మీడియా ప్రభావంతో ఇప్పుడు ఈ ప్రదేశానికి చాలామంది క్యూకట్టేస్తున్నారు. ఇక వేసవిలో అత్యంత రద్దీగా మారుతుంటుందట.

ఎగిరే ఊయల...

ఇంటి వరండాల్లో, పార్కుల్లో, లాన్లలో సరదాగా ఉయ్యాలలూగేవారిని మనం చూస్తూనే ఉంటాం. అయితే, అత్యంత ఎత్తుకు ఎగరేసే ఊయల్ని మీరెప్పుడైనా ఎక్కారా? ప్రధాన టూరిస్ట్ ఆకర్షణ ప్రాంతాల్లో ఇది ఇప్పుడో కొత్త సాహసంగా మారింది. స్వచ్ఛమైన నీటి సముద్రాలు, ట్రీ హౌస్‌లు, ఎత్తైన కొండలు ఈ భారీ ఊయలలకు వేదికలవుతున్నాయి. ట్రెకింగ్, హైకింగ్, స్నోర్కెలింగ్‌లాంటి సాహసాల్లో ఇప్పుడు ఉయ్యాలలు కూడా చేరిపోయాయి. అలాంటి వింత గొలిపే ఊయలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత పేరొందిన ప్రదేశాలేవో మీరూ చదివి తెలుసుకోండి.



- అద్దేపల్లి శర్వాణి

ఎల్లమ్మ ఎమ్‌పిడిఓ

కథ

మద్దిరాల శ్రీనివాసులు
9010619066

గంటాపురం మండలం ముకుందంపల్లె గ్రామ పాఠశాలకు క్రిష్ణయ్య సార్ ప్రధానోపాధ్యాయులుగా వచ్చారు. ఆ బడిలో అంతకుముందున్న ముగ్గురు ఉపాధ్యాయులతో కలిసి ఇప్పుడు నలుగురయ్యారు. క్రిష్ణయ్య గారు, హెడ్‌మాస్టర్ గా కొత్తే. కానీ,.. ఉపాధ్యాయుడుగా ,ఒకప్పటి కిట్టయ్య పంతులుగా ఆ గ్రామానికి సుపరిచితుడే. ఎందుకంటే ఓ 11 సంవత్సరాల క్రితమే ఇక్కడ నాలుగేళ్లపాటు పని చేసి వెళ్లాడు. ఇదిగో... ఇలా మళ్ళీ ఓ 7 సంవత్సరాల తర్వాత రెండు రోజుల క్రితమే ఇలా ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్ గా ఇక్కడ చేరారన్నమాట.

పాఠశాలలో చేరిన మొదటి రోజే హెచ్.ఎం.గా బాధ్యతలు తీసుకున్నారు. తరగతి గదులు, పరిసరాలు, పరిస్థితులు గమనించుకున్నారు. రెండోరోజు సాయంత్రం పిల్లలందరినీ వరండాలో కూర్చొబెట్టి పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారేం ఏమేం చేస్తున్నారు ?మొదలగు వివరాలన్నిటినీ చెప్పమన్నారు.

పిల్లలు చెబుతుంటే వింటూ ఉన్నారు. ఇంతలో ఒక అమ్మాయి , “నాపేరు

చందా మల్లమ్మ. మా అమ్మ పేరు పుల్లమ్మ, నాన్న పేరు మల్లయ్య. మా చిన్నక్క రవణ. ముగ్గురూ కూలీకిబోతరు. మా పెద్దక్క పేరు ఎల్లమ్మ కాలేజిలో సదుతుంది. మాబ్బాయి పేరు రాజేష్, మూడో తరగతి”, అని అన్నది. ఈ పేర్లు చెబుతుంటే, క్రిష్ణయ్య మాస్టారుకు ఏదో గుర్తుకు వచ్చింది. వెంటనే “అమ్మాయ్!మీ అక్క పేరు ఏంటన్నావ్?

“రవణ సార్!”

“కాదు..కాదు..చదువుతుందన్నావే.. ఆ అక్క పేరు”

“ఎల్లమ్మ సార్”.

“ మరి, రవణక్క చదువుకోవడం లేదా?”

“ లేద్సార్, కూలీకి పోవాలని, మా నాన బడి మాన్పించిండు”

“ మరి ఎల్లమ్మక్క చదువుకుంటుందన్నావ్ !”

“ ఆ యక్క కూడా పస్టు సదుకుంటుంటే, మా నాన మాన్పించిండంట. మల్లా మా అక్క మా నానతో పోట్లాడి బడికి పోయిందంట. అందుకని సదుకుంటోంది”

“ ఇవన్నీ నీకెలా తెలుసు?” “ మా అక్కే జెప్పింది”. ఈ మాటలు విన్న క్రిష్ణయ్య చిరునవ్వుతో, “ఆహా..అలాగా..మీ ఇల్లు రామాలయం దగ్గరకదా!?” ఉత్సాహంగా అడిగారు.

“ అవును సార్”. “ సరే! కూర్చోమ్మా” తన మనసులో ఆనందం తాండవిస్తున్న విషయం తనకొక్కరికే తెలుసు. ఇంతలో పాఠశాల సమయం పూర్తి కావడంతో బెల్ కొట్టించారు. పిల్లలూ, ఉపాధ్యాయులూ... వెళ్లారు. తాను కూడా బైకుపై నివాసముంటున్న గంటాపురం బయలుదేరారు.

బైకు చక్రాలు ముందుకు కదులుతుంటే, తన మనసులో ఆలోచనలు మాత్రం తాను ఆ పాఠశాలలో అడుగుపెట్టిన గత కాలానికి పరుగులు పెట్టడం ప్రారంభించాయి.

•••

ముకుందంపల్లె గ్రామం గంటాపురానికి 7కి.మీ.ల దూరంలో ఉంటుంది. ఓ 150 కుటుంబాలుంటాయి. అక్కడి స్త్రీ , పురుషులంతా దాదాపు 50 శాతం పైనే నిరక్షరాస్యులు. బ్యాంకుల్లో అకౌంట్లకు, పోస్టాఫీసుల్లో పింఛనులకు సంతకాలు చేయగలిగే అక్షరాస్యులు కొందరైతే, షరా మామూలుగా థమ్సఅప్ బ్రాండ్ వారే ఎక్కువ. ఎందుకంటే, అక్కడి జనాభా చాలావరకు కూలీ, నాలీల మీద ఆధారపడి జీవించేవారే. అమ్మాయిల్లో బాల్యవివాహాలు ఎక్కువ అని, అక్కడి అమ్మలను,అమ్మమ్మలను చూస్తే తెలుసింది. సర్టిఫికెట్ చదువులు చదివిన మగవారినీ, చిరు ఉద్యోగాలు చేస్తున్నవారినీ వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. వారు కూడా ఎక్కడో పట్నాలలో నివసిస్తుంటారు. చదువుకుంటే ఏమొస్తుందనేది అక్కడివారి తత్వం.

ఇక పాఠశాల పరిస్థితికి వస్తే, ఊర్లో కొందరికి అక్కడ బడి ఉందన్న సంగతి కూడా తెలియదంటే నమ్మండి. అలాగని బడిలో పిల్లలు లేరనుకునేరు. ఓ పది, ముప్ఫై మంది పైన ఉంటారు. మధ్యాహ్న భోజన సమయంలోనైతే ఓ నలభై పైనే ఉంటారు. రిజిష్టర్‌లలో.. ఓ అరవై పైనే. అందులోనూ ఎక్కువగా ఆడపిల్లలే. చింపిరి జుట్లు, చీమిడి ముక్కులు. ఒక్కరూ శుభ్రంగా రారు. అక్షరం ముక్క కూడా వచ్చేట్టు లేదు. స్వతహాగా తెలివైన వారైతే ఏదో కాస్త, విని చదువుతుంటారు. అంతే. పోనీ ఊర్లో ఉండే బడియీడు పిల్లలు ఉండేది అంతేనా? అంటే , కాదు. అలాగని అక్కడి ప్రజలు చదువు విలువ తెలియనివారా? అంటే అదీ... కాదు. వాళ్ల పిల్లలను గంటాపురంలోని ప్రయివేటు పాఠశాలలకు పంపుతుంటారు,.. ఊ... అవునండీ బాబూ.. రోజూ గంటాపురం నుండి అక్కడికి ప్రయివేటు పాఠశాలల బస్సులు కూడా రెం...డొస్తాయి. మరి, అలాంటపుడు ఇక్కడ నిరక్షరాస్యతేంటనా? డబ్బు ఉన్నన్నాళ్ళు కాన్వెంట్లకు పంపుతుంటారు. డబ్బుకు ఇబ్బంది అనిపించగానే మాన్పించేస్తుంటారు. ఇలా ఏ పాఠశాలలో కూడా చదువు పూర్తి చేయలేక పిల్లలు రెంటికి చెడ్డ రేవడిలా అవుతుంటారన్నమాట. పైగా ,అక్కడి పెద్దలు వలసలు వెళుతుంటారు. అదీ ఓ కారణమే. కొందరేమో... ముసలివాళ్ళ సంరక్షణలో ఉంటుంటారు. ఇక బడి పరిసరాలు చూడాలి... బడి వెనకంతా చిల్లకంపలు, పిచ్చి మొక్కలు. గదుల్లో తుమ్మెదలు, ఈగల సంగీతం, దోమల ఇంజక్షన్లు. మూడు గదుల్లో ఐదు తరగతులు. ఓ గదిమూలొక బీరువాలో రికార్డులుంటే, మరో కాళ్ళిరిగిన బీరువా క్రింద ఓ బండెడు మట్టి పేరుకుపోయి ఉంది. అపరిశుభ్రమైన గదులు. కూర్చోడానికి సరియైన కుర్చీలు కూడా లేవు. గోడలనిండా బూజులు, బయట ఆవరణల్లో ఇసుక, పశువుల పేడ. ఓ రెండు రోజులు బడి పరిస్థితులను గమనించారు. ఇక్కడి పిల్లల్లో చదువులు ఎందుకు రావడంలేదో, క్రిష్ణయ్య గారికి అవగతమయింది. తన మనసులో ఏదో తెలియని బాధ. రోజూ ఇంటికెళ్లినా, బడిలో ఉన్నా, ‘ఏం చేయాలా?...’అని దీర్ఘంగా ఆలోచించడం. ఏదో చేయాలన్న తపన. ఏదన్నా చేద్దామంటే, తాను హెడ్మాష్టర్ కాదాయె?

ఓ వారం గడిచింది. అక్కడ ఉన్న ముగ్గురు టీచర్లలో ఓ పెద్దాయన హెడ్‌మాస్టరన్నమాట. ఇవన్నీ సరిచేయాలని అడుగుదామంటే,అతను ఎలాంటివాడో తెలియదు. అడగందే అమ్మైనా

పెట్టదనీ.. తను చేసేది తప్పేంకాదు కదా! ఏమన్నాగానీ... అనుకుని, ఓరోజు ఉదయాన్నే బడికి వచ్చినాక, ప్రార్థన కాగానే.. అతనితో, "సార్! బళ్లో వాసనగా ఉంటోంది. పిల్లలు ఈగలతో, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. చెప్పే చదువు వినడంలేదు. ఈ పరిసరాలన్నీ శుభ్రం చేయిస్తే బాగుంటుంది సార్", అన్నారు.

" ఎవరు చేయాలి?"అన్నారు. " అదేంటి సార్? మీరు హెడ్‌మాస్టర్ కదా!".. "ఆ...అయితే?"

"శుభ్రం చేయిస్తే కదా సార్"." ఏంది? నేం జెయ్యమంటవా?"

"సార్! కోప్పడకండి సార్" "ఆ..కోప్పడక. నీకేం దెలుసునని ఇక్కడి సంగతులు. నిన్న గాక మొన్న వచ్చి..." కాస్త కసురుకున్నట్టుగా అన్నాడు. క్రిష్ణయ్య గారికి ఎందుకో కొంచెం చురుకుమంది. తాను ఇంతకుముందు వేరే బడిలో కష్టపడి పని చేసి వచ్చినవాడే. అక్కడి బడిని మామూలు స్థితినుంచి పైకి తెచ్చినవాడు. అక్కడి పాఠశాలలో చదువు బాగా చెబుతాడని కాస్త పేరున్నవాడూనూ. పైగా, పట్టుదల, తపన ఎక్కువే. అంకితభావం ఉన్న మనిషన్నమాట. అందుకే హెచ్.ఎం.గారు మాట్లాడుతున్న తీరు గమనిస్తే ఇది అయ్యేట్టు లేదని అర్థమయ్యింది. ఇక లాభం లేదనుకుని తనకు కోపమొస్తున్నా తమాయించుకుని,

" సరే సార్! మీరు ఏమీ అనుకోకపోతే,ఇదంతా నేను శుభ్రం చేయిస్తాను "

" నువు చేస్తావ్! బాగానే ఉంది. కానీ, డబ్బులు గావద్దూ. చెప్పడానికేం? ఎన్నైనా చెబుతా... నేను కూడా" అన్నారు హెడ్‌మాస్టర్.

" మిమ్మల్నేం డబ్బు అడగను సార్. ఖర్చు ఏదన్నా ఉంటే నేనే చూసుకుంటాను. మీరు పర్మిషన్ ఇస్తే చాలు." బలవంతంగా నవ్వుతూ అన్నాడు క్రిష్ణయ్య సార్. ఎన్నన్నా ఆయన హెడ్‌మాస్టర్ కదా!

" కోడలు కంటానంటే, అత్త వద్దంటుందా? నీ ఇష్టం. మరి బడిలో సదువు సంగతి ఏంటి?"అన్నాడు.

" నో ప్రాబ్లమ్ సార్.చదువు చెబుతాను సార్. కాకపోతే, సాయంత్రం వన్నవర్ పర్మిషన్ ఇస్తే చాలు. అలాగే కొందరు పెద్దపిల్లలను హెల్ప్‌గా ఉంచుకుంటాను."

" సరె. సరే... ఊర్లో వాళ్ళతో ఏదన్నా సమస్య వస్తే నాకు సంబంధం లేదు. ఈ ఊరి సంగతి నీకు తెలియదు. ముందే చెబుతున్నా" అన్నాడు.

" అలాగే సార్. అంతా నా బాధ్యతే . మీరు పర్మిషన్ ఇచ్చారు. అంతే చాలు. థ్యాంక్యూ...సార్.. థ్యాంక్యూ ..థ్యాంక్యూ " క్రిష్ణయ్య ముఖంలో ఏదో ఆనందం.

క్రిష్ణయ్య గారు తరగతి గదిలో ఎప్పుడూ కుర్చీపై కూర్చోరు. పిల్లలను చుట్టూ కూర్చోబెట్టుకుని. వారితో పాటే క్రింద కూర్చునే బోధిస్తుంటాడు.., కుర్చీలు లేవని గాదు. ఆయనకు అదో తృప్తి. ఇది అక్కడి వారికో వింత అయింది. " అయ్యో! సార్. మీరేంటి? క్రింద కూర్చున్నారు?!" అని అనడం పరిపాటి అయింది. ఎవరయినా అడిగితే "తప్పేముంది, నేనూ పిల్లవాడినేగా "అనేవారు చమత్కారంగా. ఇలా సారు పిల్లలకు తెలియకుండానే దగ్గరయ్యారు. చదువు పట్ల ఆసక్తిని పెంపొందించారు. పెద్దల్లో అభిమానాన్ని మొలకెత్తించగలిగారు.

మలిరోజు సాయంత్రం నుంచి,.. తాను తెచ్చిన గొడ్డలితో బడి చుట్టూ ఉన్న చిల్లకంపను కొట్టేయడం ప్రారంభించారు. చీపుర్లు, బూజుకర్ర కూడా తెచ్చారు. గదిముందు, లోపల ఉన్న మట్టి, బూజు, దులపడం పిల్లలకు నేర్పారు. తాను చేస్తూ, పని నేర్పించడంతో పిల్లలు కూడా ఆనందంతో "సార్..నేను చేస్తా, నేను చేస్తా" అంటూ సరదాగా చేస్తున్నారు. బడికి కొంచెం కొంచెంగా వెలుగు ఉదయించసాగింది. గ్రామస్తులు గమనిస్తున్నారు. సారు ఒక్కోపనిని చేసుకుంటూ పోతున్నారు. ఓ నాలుగైదు రోజుల్లో పరిసరాలన్నీ పరిశుభ్రం అయిపోయాయి. పిల్లలచే నీళ్ళు తెప్పించి గదులు, గోడలను కూడా సర్ఫ్‌తో శుభ్రం చేయించారు. బడి ప్రక్కనున్న కాస్త ఖాళీ స్థలముంటే, దానిని పిల్లల ప్రార్థనా స్థలంగా మార్చేశారు. కాకపోతే ప్రార్థన చేయడమే రావడంలేదు. క్రిష్ణయ్య గారు ఓ చిన్నపాటి గానగంధర్వుడే. ఇంకేముంది. ఓ వారం రోజుల్లో కొందరు పిల్లలకు అవీ నేర్పించేశారు. అంతే కాదండోయ్! మన మాష్టారు ఓ చిన్న పెయింటర్ కూడా.సో..ఓ పెయింట్ డబ్బా తెచ్చి మూడు గదులలో సూక్తులను కూడా తానే వ్రాశారు. గదులను రంగురంగుల బొమ్మల చార్టులతో, రంగు కాగితాలతో అలంకరించారు కూడా. రోజురోజుకూ తాను చేస్తున్న పనులను హెడ్‌మాస్టర్ గారు కూడా గమనిస్తూ... ఉన్నారు. తోటి ఉపాధ్యాయుడు కూడా సహకరిస్తున్నాడు. పిల్లలు చదువులో ఎక్కడ వెనుకబడి ఉన్నారో గమనించి వ్యక్తిగత బోధన చేస్తున్నారు. ఓ నెల గడిచేసరికి బడి ఓరూపానికి వచ్చింది. ఇప్పుడు అందరికీ బడి ఉనికి తెలిసిందండోయ్! ఆ అందరిలో కిట్టయ్య సార్ పేరు బాగా వినిపిస్తోంది. ఓ రోజు హెడ్‌మాస్టర్ గారిని," సార్! ఊర్లో చాలా మంది పిల్లలు ప్రయివేటు బడులకు పోతున్నారు. మన బడికి పంపమని అడుగుదాం" అడిగారు.

" ఏమోనయ్యా! నువ్వేమన్నా చేసుకో. నేను రాను." అన్నాడు.

" ఆహా..హ..హా...మీరేం చేయొద్దు సార్. పేరెంట్స్‌ను కలవడానికి ప..ర్మి..షన్..?" మొహమాటంగా అన్నాడు.

" నన్నేం చేయమంటావ్?"అన్నాడు...

" ఏం లేద్సార్. సాయంత్రం ఇళ్లకు తిరగడానికి..., నాతో ఇద్దరు పిల్లలను తిప్పుకోవడానికి..."

" ఊ.... సరే...సరే..." " థ్యాంక్యూ వెరీ మచ్ సార్" ఉత్సాహంతో అన్నాడు.

ఇద్దరు పెద్ద తరగతి పిల్లలతో, బడి మధ్యలో మానేసిన పిల్లల ఇళ్ళకు తిరగనారంభించాడు.

చదువు విలువ తెలియచేస్తూ తల్లిదండ్రులను అడగడం ప్రారంభించాడు. ముఖ్యంగా ఆడపిల్లలను ఎక్కువగా కూలి పనులకని, తమ చిన్న పిల్లల సంరక్షణకని, ఇంటి పనులకనీ మాన్పించిన వారు కొందరైతే, చదువుకుంటే ఏమొస్తుందని, ఎక్కువ చదువు చదివితే అంతకంటే ఎక్కువ చదివిన వారిని భర్తలుగా తేవడం ఒక కష్టమనీ, అంతకు మించి ఎక్కువ చదివితే ఎక్కువ కట్నాలు ఇచ్చుకోవాల్సి వస్తుందనీ .... ఇలా రకరకాల మాటలు వినిపించాయి. వీటన్నిటికీ తన గతానుభవంతో,సమాధానం చెప్పసాగారు క్రిష్ణయ్య గారు. ఇలా కిట్టయ్య సార్ ఊర్లో వెళ్ళినచోటల్లా గుమి గూడుతున్నారు. దాదాపు అందరికీ ఆయన పరిచయమయ్యారు. ఆయన మాటలు అందరికీ.. నచ్చసాగాయి. అలాగే పిల్లలను శుభ్రంగా కూడా పంపాలంటూ చెప్పేవారు. పాఠశాలలో కూడా హెడ్‌మాస్టర్ గారిని ఒప్పిస్తూ..ఒక్కొక్కటిగా కార్యక్రమాలు తన సొంత ఖర్చుతోనే చేయసాగారు.పిల్లలతో సైన్స్‌ఫెయిర్ నిర్వహింపజేయించారు. చిన్న చిన్న పిక్‌నిక్‌లు, విజ్ఞాన విహారయాత్రలు చేయించారు. పాఠశాలలో జరిగే స్వాతంత్ర్యదనోత్సవం, బాలల దినోత్సవం, మాతృభాషాదినోత్సవం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రమశిక్షణ ,శుభ్రత వచ్చింది. పద్యాలు, దేశభక్తి గీతాలు. పిల్లలచే చిన్న చిన్న నాటికలు చేయించడం. సభలో మాట్లాడించడం. అలా..అలా... మండలంలో ఆ పాఠశాలకు బాగా పేరు వచ్చింది. పాఠశాల కార్యక్రమాలకు అక్కడి అధికారులైన ఎం.డి.ఓ, ఎం.ఈ.ఓ,ఎం.ఆర్.ఓ, ఎస్.ఐ లాంటి పెద్దలను కూడా పాఠశాలకు ఆహ్వానించి పిలుచుకుని వస్తున్నారు. వారిచే సందేశాలు, బహుమతి ప్రదానోత్సవాలు నిర్వహింపజేస్తున్నారు. చివరికి తక్కువ ఖర్చుతో ఆ సంవత్సరం విద్యార్థులతో తోటి ఉపాధ్యాయుల సహకారంతో వార్షికోత్సవం కూడా నిర్వహించారు.

తరువాతి సంవత్సరం నుండీ...ఆ గ్రామంలోకి ప్రయివేటు బడుల వాహనాలు రావడంలేదు.కానీ, బడికి రాని బడియీడు ఆడపిల్లలు ఇంకా మిగిలి ఉన్నారు. కిట్టయ్య గారు ఉద్యమం కొనసాగిస్తూనే ఉన్నారు. ఓ రోజు మల్లయ్య అనే వ్యక్తి ఇంటికి వెళ్లాడు."ఏం మల్లయ్యా.ఎల్లమ్మను మధ్యలోనే బడి మాన్పించావంట."

ఇంతలో ఎల్లమ్మ వాళ్ళమ్మ పుల్లమ్మ " ఏందయ్యా.... ఎవురీనా?" అంటూ ఇంట్లో నుండి బయటకొచ్చింది.

" సార్ లేవే. మనూరికి కొత్తగా వచ్చాడు. మన ఎల్లమ్మను బడికి పంపమని"చెప్పాడు మల్లయ్య.

" ఏందయ్యా? పంపేదీ !ఇంట్లో పనులెవరు జేత్తరూ...?" మల్లమ్మ దబాయింపు.

ఎన్నో రకాల చెప్పి చూశారు. కానీ, మల్లయ్య మెత్తబడినా... పుల్లమ్మ మాత్రం..తన చంటి పిల్లోడికి సంరక్షకురాలిగా ఉండాలని.. ససేమిరా అంది. కానీ, ఎల్లమ్మలో చదువు పట్ల ఆసక్తి ఉందని గమనించి," సరే!ఆలోచించండి. రేపు వస్తాను"అని వెళ్లాడు. క్రిష్ణయ్య గారు మనసులో మాత్రం, ఎలాగైనా ఆ అమ్మాయిని బడిలో చేర్పాలనుకున్నాడు. గ్రామంలో బాలకార్మికులు

అనేవారు లేకుండా చేయాలనీ, బడి యీడు పిల్లలందరినీ బడిలో చేర్చాలని ఒక ఉద్యమంలా చేస్తున్నాడు. తరగతిలో కూడా చదువుకుంటే ఎలాంటి లాభం ఉంటుంది? తల్లిదండ్రులను గౌరవించడం, ఎవరి సపోర్టు లేకున్నా, ఎలా తమ చదువులు కొనసాగించాలి? అమ్మాయిలైతే పెద్దయ్యాక బాల్యవివాహాలు జరిగే పరిస్థితి వస్తే, ఎలా ఎదుర్కోవాలి? లాంటి విషయాలన్నిటినీ సున్నితంగా వివరించుతూ ఉండేవారు. ఓ వారం తర్వాత తన నాలుగో తరగతికి వెళ్లిన క్రిష్ణయ్య గారికి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి. తరగతి గదిలో ఎల్లమ్మ. " అరె!ఎల్లమ్మా. ఇక బడికి రోజూ వస్తావా?". "వస్తా సార్." "మరి మీ అమ్మవాళ్ళు.....?"అంటూ.. క్వశ్చన్ మార్కు పెట్టాడు. " ఇంట్లో రోజూ పని చేశాకే బడికి వత్తానన్నా". " వెరీ గుడ్." అన్నాడు.

కానీ, మధ్యమధ్యలో ఎల్లమ్మ బడి మానడం. మరలా మాష్టారు వాళ్లింటికి వెళ్లడం, నచ్చజెప్పడం, ఆ అమ్మాయే ఏదో ఒకటి చెప్పడం... ఇలా జరిగేది. చదువులో మాత్రం జెమ్ అని అర్థం అయ్యింది. ఒడిదుడుకులతోనే ఎల్లమ్మను ఆరోతరగతికి గంటాపురం హైస్కూలులో చేర్పించేలా చేశాడు క్రిష్ణయ్య గారు. కానీ, హైస్కూలుకెళ్లిన ఓ సంవత్సరానికే మళ్లీ ఎల్లమ్మ బడి మానవలసి వచ్చింది. వాళ్ళ ఇంటికి వెళ్లి పరిస్థితి కనుక్కుందాం అనుకునే తరుణంలో తను ఇతర మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ నుండి మరో మండలంలోని ఇంకో పాఠశాల. ఇలా మరలా ఇదిగో... ఓ 8 సంవత్సరాల తర్వాత ఈ మధ్యనే ఈ ఊరికి వచ్చి హెడ్‌మాస్టర్‌గా వచ్చినారన్నమాట. ఆలోచనల నుండి తేరుకునే సరికి తన ఇల్లు చేరుకున్నారు మాష్టారు.

● ● ●

ఆ తరువాతి రోజు పాఠశాల ముగిసిన తర్వాత ఒకసారి మల్లయ్య వాళ్లింటికి వెళ్దామనుకున్నారు. ఇంతలో,"నమస్కారం సార్" అన్న పిలుపుకు అటు చూసిన క్రిష్ణయ్య సార్ ఆనందం అంతా ఇంతా కాదు. ఎదురుగా ఎల్లమ్మ. ఆ అమ్మాయి ముఖంలో ఆనందం ఇన్నాళ్ళ తరువాత తన అభిమాన ఉపాధ్యాయున్ని కలిసిన ఆనందం తాండవిస్తోంది.

" ...ఎల్లమ్మా...రా..రా..రా....ఏమిటి సంగతులు? బాగున్నావా?ఏంటి సంగతులు? ఏం చదువుతున్నావ్?"...అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

" బి.ఏ..ఫైనలియర్..సార్. రేపు 12 వ తేదీనుండి ఎగ్జామ్స్ రాయాలి.".

"మొత్తానికి నువ్వు చదువుకుంటూ ఉండడం చాలా ఆనందంగా ఉందమ్మా. అవునూ... మీ నాన్న వాళ్ళు నువ్వు చదవడానికే ఒప్పుకునేవాళ్ళు కాదు కదా.. మరి, ఏం చేశావు?" అడిగాడు మాష్టారు.

"అంతా మీరిచ్చిన ధైర్యమే సార్. నేను సెలవు రోజుల్లో కూలీకి వెళ్తూ. నా ఖర్చులు నేను సంపాయించుకుంటూ బడికి వెళ్తానని మా నాన్నతో గట్టిగా మాట్లాడినా. అంతేగాని, నువ్వు ఏంచేసినా మబి మాత్రం మాననన్నాను. మీరు చెప్పారు కదా. చదువుకుంటే ఎన్ని లాభాలున్నాయో? మా నాన్నకేమో... చదువుకుంటే ఎక్కువ కట్నాలు ఇవ్వాల్సి వస్తుందని. అందుకే నేను, అవేం అవసరం లేదు నాన్నా. నన్ను బడి మానమని మాత్రం అడగకు. ఒకవేళ నువ్వు అన్నా నేను మాత్రం మానే ప్రసక్తే లేదని గట్టిగా చెప్పా.. దాంతో ఇక మాట్లాడలేదు. పైగా చదువుకుంటే మనం కోర్కెలు తీర్చుకునే కల్పవృక్షం మన దగ్గర ఉన్నట్లేనని చెప్పారుగా మీరు. ఆనాడు మీరు చెప్పిన ప్రతి మాటా నాకు గుర్తున్నాయి సార్. మీ క్రమశిక్షణ, మీ మాటలు, మీరు నా దగ్గర క్రింద కూర్చుని మరీ, అర్థం కాని ప్రతి విషయాన్ని చెప్పిన తీరు, ఇవన్నీ నన్ను బాగా ఆకర్షించాయి సార్. అందుకే ఇలా చదువుతూ ఉన్నా".. ఎల్లమ్మ మాటలు క్రిష్ణయ్య గారి మనసులో ఆనందం పరవళ్ళు తొక్కిస్తున్నాయి.... అప్రయత్నంగానే.. సార్ నోటి వెంట," వెరీ గుడ్ అమ్మా... చాలా సంతోషం. అవునూ.. ఇంతకీ కాలేజీలో ఎన్నో ర్యాంకమ్మా?" " ఫస్ట్ ర్యాంక్ సార్." "ఆహా...నైస్. ఇంతకూ.. మరి నీ లక్ష్యం ఏమిటో...?" " మీరు చెప్పిన దాన్ని బట్టి, నాకు ఆనాడే.. ఏదైనా మా ఊరి ప్రజలకు, ఈ బడికి నేనేదైనా సహకారం చేయగలిగే ఉద్యోగం చేయాలనుకుంటున్నాను సార్. అంతేగాక... అప్పుడు మన పాఠశాలకు అప్పటి మన ఎం.డి.ఓ. అరుణాదేవి గారు వస్తుండేవారు కదా. ఆ మేడమ్ గారి మాటలు కూడా నాకు చాలా బాగా నచ్చాయి. అందుకే నేను కూడా ఆమెలాగే ఎం.డి.ఓ.కావాలని ఉంది సార్."

" వెరీ గుడ్ డెసిషన్ . మరి ఎండిఓ కావాలంటే ఏం చేయాలో తెలుసా."

" ఏమో సార్. అప్పుడు మీరు చెప్పేవారు కానీ, గుర్తు లేదు." హ..హ..హ... అంటూ నవ్వి, " ఏం ఫరవాలేదు. నేనున్నాగా. చెప్తానులే. ముందు రోజూ బాగా న్యూస్ పేపరు చదువుతుండడం అలవాటు చేసుకుంటూ ఉండు"

"చదువుతున్నాను సార్. కాలేజీ లైబ్రరీలో, మన మండలం లైబ్రరీకి వెళ్లి అన్ని పేపర్లు చదువుతున్నా. అప్పుడు మీరు నేర్పారుగా. పుస్తకాలు చదవడం, సమీక్షలు రాయడం, కథలు చదవడం అవన్నీ చేస్తున్నాను సార్."

" ఆ.. వెరీ గుడ్.." క్రిష్ణయ్య సార్ మనసు గాలిలో తేలుతున్నట్టు ఉంది. ఇవన్నీ వింటుంటే, పాటలు కూడా ఓ మోస్తరుగా పాడగలిగే ఆయనకు, మనసులో,' ఒకటే జననం... ఒకటే మరణం.. గెలుపు పొందు వరకూ... అలుపు లేదు మనకూ....' అంటూ పాడుకోసాగారు. ఇద్దరూ మాట్లాడుకుంటుంటే పక్కనే ఉన్న ఆయన తరగతి చిన్న పిల్లలు వింటూ ఉన్నారు. కానీ, వాళ్లిద్దరూ కబుర్ల ప్రపంచంలోకి వెళ్లారు. తిరిగి ఈ ప్రపంచంలోకి వచ్చేసరికి అక్కడ వీళ్ళిద్దరే ఉన్నారు. చీకటి పడబోతోంది కూడా. ఎలాగైనా ఈ అమ్మాయిని తనకు ఇష్టమైన ఉద్యోగం వచ్చేందుకు సహకరించాలని మనసులో దృఢ నిశ్చయం చేసుకుని, ఆ అమ్మాయిని మెచ్చుకుంటూ," చాలా సంతోషమమ్మా..! నీ పట్టుదల, విశ్వాసం తప్పకుండా నీ కోరిక నెరవేరుస్తుంది. సరే! మరలా కలుద్దాం. అప్పుడప్పుడూ కనబడుతూ ఉండు" అంటూ బయలుదేరారు.

" అలాగే సార్.. నమస్తే..." అంటూ ఎల్లమ్మ కూడా ఇంటికి వెళ్లింది. క్రిష్ణయ్య సార్ ఇంటికైతే వెళ్లాక, కాళ్ళు మొహం కడుక్కుని ఈజీ ఛైర్‌లో కూర్చొన్నాడు. ఇంట్లో తనైతే ఉన్నాడు కానీ, మనసంతా ఎల్లమ్మ గురించే. తను ఎలాగైనా ఆ అమ్మాయి కోర్కె జయించగలిగేలా చేస్తే గ్రామస్తులకు కూడా చదువు విలువ తెలుస్తుంద. పిల్లలో చదువు పట్ల ఆసక్తి పెరుగుతుంది. పైగా ఇలాంటి అమ్మాయి ఎం.డి.ఓ. అయితే ఇలాంటి గ్రామాలు ఎన్నో అభివృద్ధి చెందుతాయి. పలువురికి ఎల్లమ్మ ఆదర్శం కావాలి. ఇలా ఆలోచనల్లో నిండి ఉన్న తను " ఏమండీ!....ఏమండీ!.. కాఫీ..." అన్న భార్య పిలుపు వినపడి ఉలిక్కి పడినంత పనయ్యింది.

" ఏమిటండీ... 18 ఏండ్ల నుంచి చూస్తున్నా. ఎప్పుడూ బడి ఆలోచనలే. కనీసం ఇంటికి వచ్చాకైనా కాస్త మనసుకు విశ్రాంతి ఇవ్వవచ్చుగా..... అయినా, ఎప్పుడూ లేంది? ఏంటి ఇవ్వాళ ఎక్కువగా ఆలోచిస్తున్నారే... ఏమిటో సంగతి?" ఎప్పుడూ అన్ని విషయాల్లో తనను ప్రోత్సహిస్తూ, అండగా ఉంటున్న తన శ్రీమతి సత్య కాఫీ కప్పు చేతికిస్తూ అడిగింది.

" ఏమిలేదు సత్యా. అప్పటి నా శిష్యురాలు ఒక అమ్మాయి ఎల్లమ్మ అని... ఇవ్వాళ కలిసిందీ...." అంటూ విషయం అంతా.. చెప్పాడు.

ఆ మాట విన్న సత్య," దానికంత ఆలోచిస్తారెందుకండీ... అక్కడ హైదరాబాదులో మీ ఫ్రెండ్ ఎవరో ఈ ఉద్యోగాలకు కోచింగ్ ఇస్తుంటారని అన్నారు కదా! అడగండీ సరిపోతుంది. ఏదన్నా ఖర్చులాంటిదైతే మనమే సహాయం చేద్దాం." అంది. ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతూ..," హ..హ.. నిజమేనోయ్. ఆలోచనల్లో పడి ఆ సంగతే మర్చిపోయాను. వెంటనే ఫోన్ కలిపాడు. ఫ్రెండ్‌కు విషయం అంతా చెప్పాడు. ఆ తరువాత రోజు బడి పూర్తయ్యాక ఎల్లమ్మ వాళ్లింటికి వెళ్లాడు. ఎల్లమ్మ కూడా అప్పుడే కాలేజీ నుండి ఇంటికి వచ్చింది. విషయం చెప్పాడు. మల్లయ్య పుల్లమ్మలలో కూడా ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. పెద్దలతో చాలా గౌరవంగా మాట్లాడుతున్నారు. అంతా ఎల్లమ్మ చలవే అయ్యింటుందని మాష్టారు మనసులో అనుకున్నాడు. ఎగ్జామ్స్ కాగానే ఎల్లమ్మ హైదరాబాద్ లో గ్రూప్స్ కోచింగ్ కు వెళ్లింది. తన ఫ్రెండ్ ఉచితంగా కోచింగ్ ఇచ్చాడు. భోజనం ఖర్చు మల్లయ్య పెట్టుకున్నాడు. అందుకు కావల్సిన పుస్తకాలు క్రిష్ణయ్య మాష్టారు పెట్టుకున్నాడు. కొన్నాళ్ళకు డిగ్రీ రిజల్ట్ వచ్చింది. ఎల్లమ్మ యూనివర్సిటీలో మంచి ర్యాంక్ సాధించింది కూడా.

ఆ తర్వాత ఎల్లమ్మ... గ్రూప్‌లో తాననుకున్న పోస్ట్‌కు సెలక్టయ్యింది. ట్రైనింగ్ కూడా పూర్తి అయ్యింది. ఇప్పుడు గంటాపురానికి ఎల్లమ్మ 'ఎం.పి.డి.ఓ'....ఊ.....

✦

జాను తెలివి రొయ్య సాహసం

బాలల కథ

అదొక అందమైన కొలను. అందులో ఓ చిన్ని చేపపిల్ల. ఆ చేప పిల్ల ఎవరూ లేరు. అక్కడున్న చేపలు కలసి జాను అనే పేరు పెట్టాయి. జాను పెరిగి పెద్దదయింది. పోయిన ఏడాది వేసవి కాలంలో కొలనులోని నీళ్ల ఎండిపోయినప్పుడు ఒక లోభి జాలరి వచ్చి జాను అమ్మానాన్నలను పట్టుకెళ్ళాడంట! అప్పుడు పుట్టింది జాను.

ఈ ఏడాది వేసవి కాలంలో జాలరి వచ్చినా ఈ కొలను నుంచి ఒక్క చేపపిల్లని కూడా తీసుకుపోకుండా చేయాలనుకుంది జాను. అనుకున్నదే తడవుగా జాను అందరిని ఈ రోజు రాత్రికి సమావేశ స్థలానికి రావాలని చెప్పింది అని కొలను అంతా దండోరా వేశారు. చేపలు, మొసళ్లు, పీతలు, రొయ్యలు, పాములు సమావేశ స్థలానికి చేరుకున్నాయి. ఎందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశావు? అని ప్రశ్నించాయి. ఈ కొలనులో ఉన్న ప్రతి ప్రాణికీ నేను చెప్పేదేమిటంటే మనమందరం కలసికట్టుగా ఒకే మాటపై ఐకమత్యంతో ఉంటే ఎంతటి ఆపదనైనా జయించవచ్చు అన్నది. ఈ వేసవిలో ఇక్కడున్న ఏ ప్రాణికి ప్రాణహాని జరగకుండా మనమే కాపాడుకుందామని చెప్పింది.

జాను చెప్పిన మాటలు చాలా జలచరాలుకీ లెక్కచేయలేదు. ఇంతలో వేసవి వచ్చేసింది. నీళ్ల తగ్గడం మొదలయ్యింది. అందరూ ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఎవరికి ఎలాంటి ఆపద పొంచి ఉందో అని కలత చెందుతున్నారు. ఇంతలో జాలరి రానే వచ్చాడు. కొలనులో చాలా చేపలు పైనే కనిపిస్తుండటంతో జాలరి అందులోకి దిగి ఒక చేపను పట్టుకున్నాడు. ఆ చేప గిలా గిలా కొట్టుకుంటూ నన్ను రక్షించండి! నన్ను రక్షించండీ! అని కేకలు పెట్టింది. అది విన్న జాను అక్కడికి వచ్చి నేను చెప్పింది ఎవరూ వినలేదు. మీరెలాగైనా చావండని వెళ్లి పోతుండగా, ఇక నుంచి నువ్వు ఏది చెప్తే అదే చేస్తామని కొలనులో ఉన్న అన్ని ప్రాణులు వేడుకోవడంతో జాను సరే అని ఒప్పుకుంది.

జాలరి రెండవ చేయి నీళ్ళల్లోకి పెట్టి చేపను పట్టుకోవడానికి చూస్తుండగా జాను రొయ్యతో నువ్వు అతని చేతికి చిక్కి నీ మీసంతో బలంగా చేయిపై పొడిస్తే నిన్నూ ఇంకో చేతిలో ఉన్న చేపను వదిలేస్తాడు అంది. ఆ...నేను చిక్కను బాబోయ్! నా ప్రాణాలు పోతాయ్ అంది రొయ్య! ఇప్పుడే కదా! అందరూ నేను చెప్పింది వింటామన్నారు. అప్పుడే ఈ రొయ్య నామాట వినడంలేదు అంది జాను. మరోవైపు 'నా ప్రాణం పోయేలా ఉంది', నన్ను రక్షించు జాను అని జాలరి చేతికి చిక్కిన చేప కేకలు పెడుతోంది.

ఇంకో రొయ్య నేను సిద్ధం అతని చేతికి చిక్కడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని జాలరి చేతికి పట్టుపడింది. అతడు ఆ ఏదో దొరికింది! అని చేయి పైకెత్తి రొయ్యను చూసి మురిసిపోతూ, ఈ రోజు రాత్రికి మా ఆవిడతో రొయ్యల పులుసు చేయించుకోవచ్చు అనుకొని సంబర పడిపోయాడు. ఆ సంబరం ఎంతో సేపు నిలవలేదు. ఆ మరునిమిషమే రొయ్య జాలరి చేతిపై బాగా పదునుగా ఉన్న మీసంతో పొడిచింది. అబ్బా..! అంటూ.. రెండు చేతుల్లో ఉన్న చేపల్ని జారవిడిచి జాలరి తన చేతిపైన దిగిన రొయ్య మీసం తీసేయడానికి తన నోటికి పని చెప్పాడు. జాను ఆ రొయ్య చేసిన సాహసానికి మెచ్చుకుంది.

జాలరికి కోపం వచ్చింది. చిన్న చేపను కూడా నాకు కాకుండా చేశావు కదా రొయ్యా! ఉండు నీ సంగతి చెప్తా.. అని ఆ రొయ్యను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. జాను పాముతో నువ్వు జాలరి చేతికి చిక్కావనుకో నిన్ను చూసి ఆ జాలరి వెంటనే వదిలేస్తాడు అని సలహా ఇచ్చింది. సరే...అని పాము జాలరి చేతికి చిక్కింది. జాలరి ఏదో దొరికిందని సంబరపడుతూ చూడగా పాము అమ్మో... పాము అని విసిరేశాడు. ఈ సారి భయంగా నీళ్లలోకి చేయి పెట్టాడు. జాలరి చేతికి చిక్కమంది. మళ్లీ జాలరి చేతికి పాము చిక్కడంతో భయపడ్డాడు. మొసళ్లని శబ్దం చేయాలని చెప్పింది. చెప్పగా వాటి అరుపులు విన్న జాలరి ఈ కొలనులో ఉన్న అన్ని ప్రాణులూ ఏకమైనట్టున్నాయని భయంతో పరుగు తీశాడు.

జాను తెలివికి, రొయ్య తెగింపుకి అన్ని ప్రాణులు కృతజ్ఞతలు తెలిపాయి. ఐకమత్యంతో ఉంటే ఎలాంటి ఆపదనైనా జయించవచ్చని జాను రుజువు చేసింది. ఇక ఆ రోజు నుంచి ఆ కొలనులోని ప్రాణులన్నీ ఏ ఆపదా లేకుండా ఆనందంగా జీవించడం ప్రారంభించాయి.

- చింతా లక్ష్మీ నారాయణ
9908830477

దారితప్పిన పిల్లవాడు

- పి.చంద్రశేఖర ఆజాద్
9246573575

17

తను అనుకుంది వేరు. ఎప్పుడో చూసిన సినిమా గుర్తు వస్తోంది. అందులో దుర్మార్గులు అమ్మనీ, నాన్ననీ చంపేస్తారు. తప్పించుకున్న వాళ్ల అబ్బాయి పారిపోయి ఇలాంటి పనులు చేస్తుంటాడు.

ఆ తర్వాత పేర్లు వస్తుంటాయి. అప్పటికి వాడు పెద్దవాడు అవుతాడు. కార్లలో తిరుగుతుంటాడు. రౌడీలకు నాయకుడు అవుతాడు. బోల్డంత డబ్బులూ, బంగారం సంపాదిస్తాడు.

ఆ సినిమా సుధకి బాగా నచ్చింది. ఇప్పుడు అనుకుంటున్నాడు. ఆ పిల్లవాడు పెద్దయ్యే దాకా ఏం చేశాడు? ఎలా బతికాడు. రాళ్ల కొట్టాడా? ఇంకేమన్నా చేశాడా? అప్పుడు వీపు మీద చ(రుమంది.

ఎవరో బెత్తంతో వీపు మీద కొట్టారు. ప్రాణాలు పోయినట్లు అనిపించింది. 'అమ్మా' అని అరిచాడు. దూరంగా పని చేస్తున్న వాళ్లు ఓ నిముషం ఆగి సుధని చూసి, మళ్లీ పనిలో మునిగిపోయారు. 'కామ్ కరో' అన్నాడు కఠినంగా.

అంత బాధలోనూ సుత్తి అందుకున్నాడు. వీపు మీద ఎర్రగా కందిపోయింది. వీపు మీద చేత్తో రాసుకోవాలన్నా భయం కలిగింది.

దుఃఖం వస్తోంది. ఏడుస్తూనే రాళ్ల కొడుతున్నాడు. అతను ఇంకో చోటుకి వెళ్తున్నాడు. దానికి తోడు ఎండ బాధ...

తర్వాత ఎప్పటికో పని ఆపమన్నారు. ఓ చోట ప్లాస్టిక్ డబ్బా ఉంది. అందులో నీళ్ల ఉన్నాయి. అక్కడ చేతులు కడుక్కుంటున్నారు. సుధ కూడా అక్కడికి వెళ్లాడు. అక్కడ పళ్లాలున్నాయి. అవి తీసుకుంటున్నారు. అవి బొచ్చెల్లా ఉన్నాయి. అందులో మూడు ఇడ్లీలు వేశారు. దాని మీద నీళ్ల సాంబారు పోశారు.

పక్కకి వచ్చాడు. వాసన చూశాడు. వాంతి అవుతుందా అనుకున్నాడు.

ఆకలిగా ఉంది. బలవంతగా నోట్లో పెట్టుకున్నాడు. ఇంతకుముందు అమ్మ ఇడ్లీనే పెట్టటం గుర్తొచ్చింది. అప్పటి నుండి ఇడ్లీ అంటేనే మొహం మొత్తింది. ఇప్పుడు మాత్రం బాగానే ఉందని అనిపిస్తోంది. లేచి వెళ్లి నీళ్ల తెచ్చుకుని తాగాడు.

'ఆకలి రుచి ఎరగదు' అనే సామెత గుర్తు వచ్చింది. మళ్లీ అందరినీ పనుల్లోకి పంపించారు. ఎవరూ ఎవరితోనూ మాట్లాడుకోవటం లేదు. యంత్రాల్లా పని చేసుకు పోతున్నారు.

చీకటి పడుతుండగా పనులు ఆపారు. కొంతమంది స్నానాలు చేస్తున్నారు. సుధ కూడా ఓ ప్లాస్టిక్ డబ్బా దగ్గరికి వెళ్లి స్నానం చేశాడు.

ఆ తర్వాత రొట్టెలు ఇచ్చారు. అవి తిని ప్లేటుని కడిగాడు. తర్వాత మంచి నీళ్ల ఓ సీసాలో నింపుకుని రేకుల షెడ్డు దగ్గరికి వచ్చాడు. అక్కడ పాత జంపఖానా పరిచి ఉంది. తల కింద దిండు లేదు. అయినా దుప్పటి కప్పుకున్నాడు. వీపు చురుక్కు మంటున్నా తనకి తెలియకుండా నిద్ర పట్టేసింది.

పిల్లల సీరియల్

ఎన్ని రోజులు గడిచిపోయాయో తెలియదు. వాళ్లకి ఆదివారం, సోమవారం అంటూ తెలియదు. ఉదయం వస్తారు. కర్రతో శబ్దం చేస్తారు. లేవకపోతే అది ఒంటి మీద పడుతుంది.

అక్కడ నుండి పనిలోకి వెళ్లాలి. కొండల్లో మందు కూరుతుంటారు. అది బద్దలయినప్పుడు దూరంగా రాళ్ల వచ్చి పడుతుంటాయి. పెద్ద పెద్ద బండలు బయట పడతాయి.

టిప్పర్లలో వాటిని తీసుకు వస్తారు. వాటిని రకరకాల సైజుల్లో బద్దలు కొట్టాలి. చాలామంది పిల్లలు ఉన్నారు.

అందరినీ ఇలానే ఎత్తుకు వచ్చి ఉంటారు. వాళ్లని కొడుతున్నప్పుడు రకరకాల భాషల్లో అరుస్తుంటారు. బాధ కలిగినప్పుడు అమ్మ భాషలో అరుస్తుంటారని సుధకి అర్థం అయింది.

అందరూ కళ్లతోనే మాట్లాడుకుంటున్నారు. ట్రక్కులు వస్తుంటాయి. రాళ్లను తీసుకు పోతుంటాయి. అవి ఎక్కడికి పోతున్నాయో తెలియదు. అన్నింటి కంటే ముఖ్యమైన విషయం అక్కడ నుంచి బయటకు వెళ్లటం కష్టం. చుట్టూ కాపలా ఉంటుంది. అప్పటికీ కొంతమంది ప్రయత్నం చేస్తుంటారు.

ఓ రోజు అలాంటి వ్యక్తిని పట్టుకొచ్చి చావబాదారు. హృదయ విదారకంగా అరుస్తున్నా వారికి జాలి ఉండదు. చుట్టుపక్కల ఏ ఊరూ కనపడదు.

అలాంటి కొండల మధ్య అంత మంది పనిచేస్తున్నారు అనే విషయం ఎవరికీ తెలియదు. అక్కడికి ఎవరూ రారు.

పని చేస్తున్న వారికి జీతం ఏం ఉండదు. వారికి పని చేయటానికి శక్తి కావాలి కాబట్టి తిండి పెడుతుంటారు. కనీసం పెద్ద మెషీన్లూ ఉండవు.

అక్కడ రాత్రికీ, పగలుకీ పెద్ద తేడా ఉండదు. క్రమంగా షెడ్డులోకి ఇద్దరు ముగ్గుర్ని ఉంచుతున్నారు. జ్వరం లాంటివి వచ్చినప్పుడు ఏ పేరూ లేని మందు బిళ్లలు ఇస్తుంటారు.

అప్పుడు పరిచయం అయ్యాడు బిక్కు. అతనిది ఏ భాషో కూడా అర్థం కాలేదు. తన ఈడు వాడే. సుధ అర్థం చేసుకున్న దాని ప్రకారం అతనొక గిరిజనుడు.

అడవే వాళ్ల ప్రపంచం. కొంత హిందీ వస్తుంది. అడవుల్లో ఎన్ని సమస్యలు ఉన్నా వాళ్ల ఆనందం వారిది. అక్కడికి కొత్త మనుషులు రావటం మొదలయింది. గూడెం దొరలని మచ్చిక చేసుకున్నారు.

బిక్కుని గూడెం దొర అమ్మేశాడు అని చెప్పినప్పుడు ఆశ్చర్యంగా అడిగాడు.

'ఎంతకు అమ్మాడు?' అని సైగలు చేసి... బిక్కు చెప్పిన మాట విన్నాక మరింత షాక్ అయ్యాడు.

కేజీ ఉప్పు కోసం బిక్కుని అమ్మాడట. ఇది నమ్మాలనిపించలేదు. అయినా తప్పదు. బిక్కుకి అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు.

'బిక్కు దాకా ఎందుకు మమ్మల్ని ఎవరూ అమ్మలేదు. నిద్ర పోతున్న వారిని

ఎత్తుకు వచ్చారు కదా అనుకున్నాడు.

సుధకి ఆశ్చర్యం కలిగించేది ఇంకోటుంది.

అక్కడ ఆడవారు మాత్రం లేరు.

• • •

ఆ రోజు గౌరి ఏడుస్తూనే ఉంది.

అప్పటికి సుధ ఇంటి నుంచి వెళ్లిపోయి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి.

అసలు సుధ బతికి ఉన్నాడా అనే అనుమానం వచ్చింది.

జయంతి వచ్చింది. గౌరిని చూడగానే ఆమెకి బాధ కలిగింది. ఈ మధ్యకాలంలో వారు పత్రికలో ప్రకటనలు ఇచ్చారు. అందులో సుధ ఫోటో కింద రాశారు.

'మా అబ్బాయిని చూసిన వారు ఇంటికి తీసుకు వచ్చినా, మాకు ఫోన్ చేసినా వారికి మంచి బహుమతి ఇస్తాం అని ఫోన్ నెంబర్ ఇచ్చారు.

నీకోసం మేమంతా ఎదురు చూస్తున్నాం. అమ్మ ఆరోగ్యం బాగుండలేదు. నిన్ను చూడాలని కలవరిస్తోంది. నిన్ను ఇంట్లో ఎవరూ ఏమీ అనరు. నువ్వు చదువుకోవద్దని అనుకున్నా ఫర్వాలేదు' అంటూ.

రజనీని విజయవాడలో హాస్టల్లో చదివించాలని బాబూరావు అనుకున్నా గౌరి ఒప్పుకోలేదు. తన కళ్ల ముందు ఉండాలంది.

ఇంటి దగ్గరకే వచ్చి రజనికి ట్యూషన్ చెప్పే ఏర్పాట్లు చేశారు. ఇద్దరు పిల్లల్నీ రిక్షాలో పంపిస్తారు. వాళ్లే తీసుకు వస్తారు.

జయంతి వాళ్లకు పిల్లలు లేరు. నిజానికి ఆమె గౌరి కంటే చిన్నది. అయినా వదినగారూ అని పిలిచినా పట్టించుకునేది కాదు. గౌరి సగానికి సగం అయింది.

ఆ రోజు జయంతి గౌరితో ఓ విషయం చెప్పటానికి వచ్చింది. గౌరితో కొంచెంసేపు మాట్లాడింది.

'మేం భీమవరం నుంచి వెళ్లిపోతున్నాం గౌరి' అంది

'అదేంటి?' అంది గౌరి.

'మీ అన్నయ్యకి గుంటూరు బదిలీ అయింది'

'నువ్వు కూడా వెళ్లిపోతే నాతో ఎవరు మాట్లాడతారు వదినా?' అని మళ్లీ కన్నీళ్లు పెట్టుకుంది.

'మరి నేనేం అనుకోవాలి' అంది జయంతి.

అర్థం కానట్టు చూసింది.

'సుధ ఇప్పుడు లేడు. అయినా మీకు ఇంకా ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాకు ఎవరున్నారు?' అంది

ఇంతకు ముందు జయంతికి పిల్లలు లేరని తెలిసినప్పుడు ఆమె మీద గౌరికి చులకన భావం ఉండేది. ఇప్పుడు బాధ కలిగింది.

'సుధ విషయంలో మనం చేయగలిగింది ఏమీ లేదు. మీరు ఎప్పుడూ సుధ గురించి ఆలోచిస్తూ, బాధపడుతూ మీ ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. మిగతా ఇద్దరి సంగతేంటి?' అంది జయంతి.

గౌరి మాట్లాడలేదు.

'మనం పిల్లల్ని కన్నప్పుడు కొన్ని బాధ్యతలు ఉంటాయి. పిల్లలు పుట్టని నేను ఇలా చెప్పటం సమంజసం కాదు అనుకో...

'అంత మాట అనకు వదినా. ఇప్పుడు నాకు అనిపిస్తోంది అసలు నేను గొడ్రాలిగా మిగిలినా బాధ ఉండేది కాదు. అదయితే ఒక్కటే బాధ' అంది.

'రేపు సుధ తిరిగి వచ్చినపుడు ఇదే మాట అంటావా గౌరి' అంది.

గౌరి తల దించుకుంది.

'నేనూ, మీ అన్నయ్యా ఓ నిర్ణయం తీసుకున్నాం. మేం ఆడపిల్లనో, అబ్బాయినో లేదా ఇద్దరినీ దత్తత తీసుకుంటాం'.

'ఆడపిల్లనా!' అంది.

'అవును. మీ అన్నయ్యకి ఆడపిల్లంటే ఇష్టం. నాకయితే ఇద్దరూ కావాలని ఉంది'

మంచిమాట చెప్పావు. ఇప్పుడైనా మా సుధ తిరిగి వస్తాడేమో' అంది గౌరి.

'సుధ అంటే మా ఇద్దరికీ ఇష్టం. అందులోనూ సుధ మొదటిసారి మా ఇద్దరితోనే విమాన ప్రయాణం చేస్తానని మాట ఇచ్చాడు. అందుకయినా తిరిగి వస్తాడు' అంది జయంతి.

ఆ తర్వాత జయంతి వాళ్లు వెళ్తున్నప్పుడు వద్దన్నా వినకుండా పట్టుచీర పెట్టింది గౌరి. రజని, మూర్తి, బాబూరావు వాళ్లు వెళ్తుంటే బాధ పడ్డారు.

• • •

కొందరు యువకులు పెద్దకారులో వస్తున్నారు. వారు భారతదేశంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాలన్నీ కారులో చుట్టి రావాలనుకున్నారు. వారి దగ్గర కెమెరాలు ఉన్నాయి. వీడియో కెమెరాల్లాంటి ఏర్పాట్లు కారులో ఉన్నాయి.

'ఇదేంటి ఎంత దూరం వచ్చినా చిన్న ఊరు కూడా కనిపించటం లేదు' అన్నారొకరు.

'ఇది ఇంకా అభివృద్ధి చెందని ప్రాంతంలా ఉంది. అయినా ఇక్కడ పంటలు లేవు. అన్నీ కొండలూ, గుట్టలూ కనిపిస్తున్నాయి. ఇక్కడ మనుషులు బతకటం కష్టం' అన్నాడు కారు నడుపుతున్న వ్యక్తి.

'ఈ కొండలయితే చూడటానికి బాగున్నాయి. ఇవి దాటితే అడవులు ఉంటాయేమో' అన్నారు.

'మనం ఓసారి దగ్గరగా వెళ్లి చూసి వద్దామా' అంటున్నాడు ఇకొకడు. అప్పుడు దూరంగా దుమ్ము లేస్తూ ట్రక్కు కనిపించింది. జాగ్రత్తగా చూస్తే ఓ ట్రక్కు వెళ్తోంది.

(ఇంకా ఉంది)

ఆటలంటే మాకిష్టం

ఇష్టం ..ఇష్టం..మాకిష్టం
మట్టి వాసన మా కిష్టం
వాన పడవలు మాకిష్టం
బొంగరాలాట మాకిష్టం
కోతి కొమ్మచ్చి మాకిష్టం

ఇష్టం..ఇష్టం..మాకిష్టం
తొక్కుడు బిళ్ళ మాకిష్టం
అష్టా చెమ్మ మాకిష్టం
కుంటుడు ఆట మాకిష్టం
కళ్ళకి గంతాట మాకిష్టం

ఇష్టం..ఇష్టం..మాకిష్టం
దాగుడు మూతలు మాకిష్టం
పరుగు పందెం మాకిష్టం
చదరంగం అంటే మాకిష్టం
ఖో..ఖో..అంటే మాకిష్టం

ఇష్టం..ఇష్టం..మాకిష్టం
కబడ్డీ అంటే మాకిష్టం
గోటు బిళ్ళ మాకిష్టం
గిల్లా దండా మాకిష్టం
క్రికెట్ అంటే మాకిష్టం

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

భలే ఐడియా

ఉల్టా గొడుగు

'ఉల్టా చాటా' అనే బెంగాలీ పదం 'అపసవ్యంగా ఉన్న గొడుగు' అని అర్థాన్నిస్తుంది. వర్షాకాలమో లేకపోతే ఎండాకాలమో రాగానే అందరికి గుర్తుకు వచ్చేది గొడుగు. సాధారణంగా దీనిని ఎండ నుంచి, వర్షం నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి వాడతాం. అయితే ఓ భార్యభర్తలు ఈ గొడుగు మోడల్‌ను ఉపయోగించి వినూత్న ప్రయోగం చేసి విజయవంతమయ్యారు. విదేశాల్లో చదువుకుని వచ్చిన వీళ్ల గొడుగును వినియోగించి వర్షపు నీటిని శుద్ధిచేయడంతో పాటు, సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి గొడుగును ఉల్టాగా ఉంచి పరికరాన్ని తయారు చేశారు.

వర్షపు నీరు ఎంతో శుద్ధమైనదని అందరికీ తెలుసు. కాని ఆ నీటిని ఉపయోగించుకోవడం మాత్రం చాలా మందికి తెలియదు. ఒకసారి అది నేలపై పడిన తర్వాత దానిని స్వచ్ఛమైన నీటిగా మార్చడానికి చాలా సమయం పడుతుంది. ఈ నీటిని కింద పడకుండా భద్రపరిచి నిల్వ చేసుకోవడం ద్వారా తాగునీటి కొరతను తీర్చుకోవచ్చని ఈ జంట ప్రయోగం ద్వారా నిరూపించారు. వర్షం, ఎండ నుంచి కాపాడుకోవడానికి వినియోగించే గొడుగు మాదిరి 'ఉల్టా చాటా' అనే పరికరాన్ని తయారు చేశారు. దీనికి అమర్చిన సోలార్ పానెల్స్ ద్వారా ఎండాకాలంలో సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేయడంతో పాటు ఫిల్టర్లను ఉపయోగించి వర్షాకాలంలో వర్షపు నీటిని వడపోసి తాగునీటిగా మార్చుతారు. సోలార్ పానెల్స్ ఉన్న ప్రదేశంలో మరే ఇతర పని చేయలేము. ఇది గొడుగు రూపంలో ఉండటం వల్ల నేలపై ఎక్కువ స్థలాన్ని ఆక్రమించదు. ఈ చాటా నీడలో పాదచారులు సేద తీరే అవకాశం ఉంటుంది. దీనిలో అమర్చిన కార్బన్ నీటిలో ఉన్న మలినాలను వడపోస్తుంది. పై బాక్సుకు 15 రెక్కలు అమర్చబడి నీటిని ఫిల్టర్ చేసేందుకు వీలుగా అనుసంధానించారు. ఒక్కొక్క చాటా ఏడాది కాలంలో 800 నుంచి 1000 లీటర్ల నీటిని సేకరించడంతో పాటు గరిష్టంగా 1.5 కిలోవాట్స్ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. 10 సంవత్సరాల వారంటీతో రూ.4.5 లక్షల నుండి 5 లక్షల ఖరీదు వరకు ఉంటుంది. అయితే దీని నుండి ఉత్పత్తి అయ్యే పవర్, నీటి ద్వారా ఒక సంవత్సరంలోనే రాబడి తిరిగి వచ్చేస్తుందని తయారీదారులు చెప్తున్నారు.

2015లో 'తింక్‌పై' అనే గ్రీన్ టెక్నాలజీని విదేశాల్లో చదువుకుని వచ్చిన దంపతులు సమిత్, ప్రియా వకిల్ చోస్కికి ప్రారంభించారు. ప్రకృతిపై వారికున్న మక్కువ ఈ నూతన ఆవిష్కరణకు దారితీసింది. పెరుగుతున్న కాలుష్యం కారణంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల వర్షాలు సమయానికి పడకపోవడం, ఒకవేళ పడినా నీరు వృథాగా పోవటం గమనించి, పరిష్కారంగా వర్షపు నీటిని శుద్ధి చేయాలని ఈ పరికరాన్ని తయారు చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 50 ప్రాంతాల్లో ఈ గొడుగులను వాడుతున్నారు. ప్రస్తుతం తింక్‌పై సంస్థలో 12 మంది సభ్యులున్నారు.

ప్లాస్టిక్‌కు ఇది మొసలి

ఈ మధ్య థాయిల్యాండ్‌లో ప్లాస్టిక్ బ్యాగ్‌ల వల్ల ఓ పైలట్ తిమింగలం చనిపోవడం పన్నెండేళ్ళ వరుణ్ శుక్లాను కదిలించింది. ఈ విషయాన్ని కాస్త సీరియస్‌గానే తీసుకున్నాడు. అప్పుడు తన చిన్న బుర్రలో ఓ పెద్ద ఆలోచనే మొదలయ్యింది. అలా రెండు నెలల్లో ఓ పరికరాన్ని కనిపెట్టి దానికి 'మకర' అని పేరు కూడా పెట్టాడు. చెరువులు, నదుల్లోని చెత్తను సేకరించే పరికరం అది. ఈ పరికరం మధ్యన తెడ్డును పోలిన రెక్కలతోపాటు ఒక మోటర్‌ను అమర్చారు. పరికరం చివరన పొడవాటి సంచి మాదిరిలో ఒక వల ఉంటుంది. మోటర్‌ను ఆన్ చేయగానే దాని పక్కనే ఉండే రెక్కలు కదులుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను వలలోకి పంపిస్తుంటాయి. ద్రవయంత్ర గతి సిద్ధాంతాన్ని ఉపయోగించి తయారుచేసిన ఈ పరికరం రోజుకు మూడు కిలోల చెత్తను సేకరిస్తుంది. ఈ పరికరాన్ని ఉపయోగించేది రిమోట్ కంట్రోలర్ సాయంతోనే. నదులు, చెరువుల్లో చెత్తను సేకరించేటపుడు మనుషులకు ఎదురవుతున్న కొన్ని ప్రమాదాలని నియంత్రించేందుకు వరుణ్ కనిపెట్టిన ఈ పరికరం భలేగా ఉంది కదా!





నవ్వుల్-పువ్వుల్

మరిచిపోలేరు

రవి: ఫస్ట్ బెంచ్, లాస్ట్ బెంచ్ స్టూడెంట్స్ మధ్య తేడా ఏమిటీ?

రాజు: ఫస్ట్ బెంచ్ స్టూడెంట్స్ టీచర్లను మరిచిపోలేరు. టీచర్లు.. లాస్ట్ బెంచ్ స్టూడెంట్లను మరిచిపోలేరు.

వాటర్‌కింగ్

టీచర్: మీ నాన్న పేరు ఇంగ్లీష్‌లో రాసివ్వు..

విద్యార్ది : అలాగే సార్...

టీచర్ : 'టెంపుల్ స్టెప్స్ వాటర్ కింగ్' ఇదేం పేరురా..

విద్యార్థి : తెలుగులో మా నాన్న పేరు 'గుడి మెట్ల గంగ రాజు' సార్..

టీచర్ : పిల్లలు, మీకు చంద్రుడి మీదకు వెళ్లాలని ఉందా? అక్కడ చాలా బాగుంటుందట.

విద్యార్థులు : అయితే, అక్కడ స్కూలు ఉండదేమో టీచర్!!

పాస్‌వర్డ్

రాజేష్ : నీకు ఈగో లోపల ఉంటదేమో...నాకు వైఫైలా చుట్టూ ఉంటది.

ప్రేమ్ : పాస్‌వర్డ్ చెప్తావా లాగిన్ చేసుకుంటా....

అంతే.. ఆ వ్యక్తికి తిన్నదంతా పీకల్లోకి వచ్చినంత పనైంది!!



మీ తాతగారిది

హోటల్ ముందు ఇలా రాసి ఉంది..

'మీరు ఎంత కావాలంటే అంత తినండి. బిల్లు.. మీ మనవళ్ల నుంచి తీసుకుంటాం'

ఆ బోర్డు చూసిన ఓ వ్యక్తి హోటల్‌లోకి వెళ్లి.. కడుపు నిండా భోజనం చేసి తాపీగా కూర్చున్నాడు.

ఇంతలో వెయిటర్ వచ్చి.. అతని టేబుల్ మీద బిల్లు పెట్టాడు.

ఆ బిల్లు చూసి వెకిలిగా నవ్వుతూ.. "బయట బోర్డులో ఏం రాశారో మరిచిపోయారా?" అని అడిగాడు.

వెయిటర్ సమాధానం ఇస్తూ.. "సార్, ఇది మీ బిల్లు కాదు. ఇది మీ తాతగారి బిల్లు, చెల్లించండి" అని చెప్పాడు.

ప్రొఫెసర్: అధిక మోతాదు ఉష్ణోగ్రతలో ద్రవపదార్థం నుంచి ఘన పదార్థంగా మారేది ఏది?

ఫ్రాన్స్ విద్యార్థి : పిచ్చి ప్రశ్న.

యుకె విద్యార్థి : గూగుల్‌లో కూడా ఈ ప్రశ్నకు జవాబు దొరకదు.

జపాన్...: మాకు తెలియదు.

రష్యా...: ఈ ప్రశ్న అడిగిన వాళ్ళకు బుర్రలేదు.

ఇండియా విద్యార్థి : హ.. హ.. హ.. ఇడ్లీ!



కొత్త విషయం

టీచర్ : న్యూటన్ చెట్టు కింద కూర్చుని గురుత్వాకర్షణ శక్తిని కనిపెట్టాడు.. దీన్నిబట్టి నీకేమి అర్థమైంది..

చింటు : ఇలా క్లాసులో కూర్చుంటే కొత్త విషయాలు కనిపెట్టలేమని తెలిసింది.. టీచర్...!



పేస్టు

రమేష్ : నీ టూత్‌పేస్టులో ఉప్పు ఉందా..!

వెంగళప్ప : అసలు పేస్టే లేదు తల్లి..!

....

టీచర్ : చరిత్రలోనే అత్యంత డేంజెరస్ అయిన ఇద్దరు కింగ్స్ పేర్లు చెప్పు...

విద్యార్థి : 'స్మో' కింగ్, 'డ్రిం' కింగ్

పద వికాసం 141

కూర్పు : రావెళ్ళ

అడ్డం ఆధారాలు

1. శీతలవాయువు (4)
3. ఓటమి (4)
7. ఔషధం (2)
8. మేఘం (3)
9. జలతారు (2)
12. కంగారు (3)
13. సారం తీయగా మిగిలిన తుక్కు (3)
17. కోరిక (2)
18. భయపడు (3)
19. సర్పం (2)
22. నాటకశాల (4)
23. కౌగిలింత (4)

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

నిలువు

1. చలికాచుకోడానికి వేసే మంట (4)
2. గాయం (2)
4. పరిణతి (2)
5. పెద్ద శరీరం కిందినుంచి (4)
6. నెత్తురు పీల్చే నీటి పురుగు (3)
10. చెదురు...గా వర్షం (3)
11. దాహం (3)
14. విఘ్నం (4)
15. వేగువాడు (3)
16. మబ్బు (4)
20. జన్మభూమిలో తుదిసగం తిరగబడింది (2)
21. తుదిలేని వెదుకు (2)

గతవారం జవాబులు

1 తా	ల	2 గిం	చు	✿	3 ఠి	4 రం	జ	5 వి
ఠి	✿	టెం	✿	6 ఉ	✿	గు	✿	శ
7 సు	సి	✿	8 కు	సు	మం	✿	9 పా	ర
డి	✿	10 రా	✿	రు	✿	11 ఆ	✿	ణం
✿	12 భ	వ	నం	✿	13 ఆ	దా	రం	✿
14 వి	✿	దం	✿	15 ఉ	✿	ద్య	✿	16 కాం
17 భా	వ	✿	18 ఉ	ద	ధి	✿	19 మూ	తి
గిం	✿	20 త్ర	✿	క	✿	21 తే	✿	గి
22 చు	21 ట్టు	కా	ను	✿	23 త	రు	వా	త

	+		=	8
+		+		
	-		=	6
=		=		
13		8		





4	+	4	=	8
+		+		
9	-	3	=	6
=		=		
13		8		

బొబ్బట్లు

కావల్సినవి

పచ్చి శెనగపప్పు : పావు కేజీ, బెల్లం : పావుకేజీ, మైదా : అరకేజి, యాలకుల పొడి : అర టీస్పూను, నెయ్యి : 100 గ్రా

తయారీ :

ముందుగా మైదాను చపాతీ పిండిలా కలిపి అరగంట సేపు నాననివ్వాలి. తర్వాత శనగపప్పును మరీ మెత్తగా కాకుండా కాస్త పలుకుగా ఉడికించి చల్లారాక గ్రైండ్ చేసుకోవాలి. అందులోనే బెల్లాన్ని పొడి చేసి వేయాలి. ఏలకుల పొడి కూడా వేసి అంతా కలిసేటట్టు ఇంకోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఇప్పుడు మైదాను చపాతీ పిండిలా కొద్దిగా తీసుకుని ఆకులో చిన్న పూరిలా చేత్తో వత్తుకోవాలి. దాంటో శనగపప్పు మిశ్రమాన్ని పెట్టి మళ్ళీ ఉండలాగా చుట్టుకోవాలి. తర్వాత దాన్ని పల్చగా చపాతీలాగా చేసుకొని పెనంపై నెయ్యితో రెండు వైపులా కాల్చాలి. అంతే వేడి వేడి బొబ్బట్లు రెడీ....

రుచి

కిచిడి

కావల్సినవి

బాస్మతి బియ్యం : 2 కప్పులు, పెసరపప్పు : 1 కప్పు, లవంగాలు : 5, అల్లం వెల్లుల్లి ముద్ద : 2 స్పూన్లు, బఠాణీలు : 150 గ్రా, క్యారెట్ : 1, ఉల్లి గడ్డలు : 3, కారం : 1 స్పూను, పసుపు : 1 స్పూను, జీలకర : 1 స్పూను, ఆవాలు : 1 స్పూను, బే ఆకులు : 2, గరం మసాలా : 1 స్పూను, నూనె : తగినంత, నీరు : తగినంత, ఉప్పు : రుచికి సరిపడా

తయారీ :

ముందుగా బియ్యం, పప్పు కలిపి గంటసేపు నానబెట్టాలి. తర్వాత ఒక పాత్రలో నూనె పోసి కాగిన తర్వాత జీలకర్ర, ఆవాలు వేసి చిటపటలాడాక మిగిలిన మసాలా దినుసులన్నీ వేయాలి. ఇప్పుడు కూరగాయ ముక్కలు, బఠాణీలు వేయించాలి. తర్వాత బియ్యం, పప్పు వేసి పది నిమిషాలు వేయించి అందులో ఐదు కప్పుల నీరు పోసి ప్రెషర్ కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉడికిస్తే 'వెజిటబుల్ కిచిడీ'రెడీ. పెరుగు రైతాతో కలిపి తింటే మంచి రుచిగా ఉంటది.

యాపిల్ తినడం వల్ల కలిగే లాభాలు మీరూ తెలుసుకుని రోజూ తినండి. ఆరోగ్యంగా ఉండండి...

విటమిన్ A equiv	3 mg
బీటా - కెరోటీన్	27 mg
లూటైన్	29 mg
థైయమైన్ B1	0.017 mg
రైబోఫ్లావిన్ B2	0.026 mg
నియాసిన్ B3	0.019 mg
పాంటోథెనిక్ యాసిడ్ B5	0.061 mg
విటమిన్ B6	0.041 mg
ఫోలేట్ B9	3 mg
విటమిన్ C	4.6 mg
విటమిన్ E	0.018 mg
విటమిన్ K	2.2 mg



ప్రేమను కనిపెట్టాలని

'ఇన్వెన్షన్ ఆఫ్ లవ్' యానిమేషన్ షార్ట్‌ఫిల్మ్... ఓ మెకానికల్ ప్రపంచంలో సున్నితమైన ప్రేమ భావనకు చోటుందా...? ఉంటే దాన్నెలా కనిపెట్టడం వంటి ఆసక్తికరమైన విషయాన్ని ఈ లఘుచిత్రం సింబాలిక్‌గా ప్రెజెంట్ చేస్తుంది. ఇక్కడ మెకానికల్ అయ్యింది మనిషా.. ప్రపంచమా అనే సందిగ్ధంలో పడేస్తుంది. ప్రేమలో పడి పెళ్లి చేసుకున్న ఓ జంట భర్త పని రాక్షసత్వం వల్ల విడిపోయి, దూరమవుతుంది. వారిద్దరి మధ్య అంతరాలు వస్తాయి. అప్పటి నుంచి భార్యకు ప్రపంచం మరోలా కనిపిస్తుంది. భర్తకు పూర్తిగా దూరమవుతుంది. తప్పు తెలుసుకుని భర్త స్పందించేలోపు నష్టం జరిగిపోతుంది. తర్వాత తన భార్యలా ఓ హృదయమున్న మర మనిషిని తయారుచేస్తే ఆమె తిరిగి దక్కుతుందా..? చిత్రం చూసి తెలుసుకోండి. యాంత్రిక జీవనంలోని విషాదాన్ని యాండ్రూ ఘుష్కోవ్ అద్భుతంగా కథరాసి తెరకెక్కించారు. ఆన్నా గుడ్కోవా వయోలిన్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. తొమ్మిది నిమిషాల ఈ చిత్రం నెట్‌లో అందుబాటులో ఉంది.

'ఇన్ ఎ నట్‌షెల్' ప్రయోగాత్మక లఘుచిత్రం.... కైనెటిక్ స్టాప్ మోషన్ టెక్నిక్‌తో దీన్ని తెరకెక్కించారు. ఓ టెంకలో గింజ.. అందులో మహావృక్షం ఎలా దాగుంటుందో... అలానే ఈ ప్రపంచమని కొందరు తాత్వికులు అంటారు. మన పరిధిలోనే ఉంటూ బావిలో కప్పల్లా బతికితే 'నట్‌షెల్ నుంచి బయటికి రా' అని కొందరు కోప్పడతారు. కానీ, యదార్థంగా ఈ ప్రపంచం ఓ నట్‌షెల్‌లో ఎలా ఉండిపోయిందీ, నట్‌షెల్ అంత చిన్న విషయాల్లో అసలు ప్రపంచాన్ని చూపించే ప్రయోగాత్మక లఘుచిత్రమే ఇది. ఓ గింజ నుంచి యుద్ధం వరకూ, మాంసపు ముద్ద నుంచి ప్రేమ వరకూ, పట్టింపులేమితనం నుంచి వినాశనం వరకూ ప్రతి విషయాన్ని ఓ నట్‌షెల్‌లో బంధించి చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. ఏ

నట్‌షెల్‌లో ప్రపంచం

పాత్రలు లేని కేవలం వస్తువులు, విషయాలు మాత్రమే తెర మీద పరుచుకునే ఈ చిత్రంలో ప్రతి క్షణాన్ని కళ్లింతలు చేసుకుని చూడాల్సిందే. ప్రపంచాన్ని కుదిపేస్తున్న శరణార్థి సమస్య నుంచి ఆహార వృథా, ఆకలి సమస్యల వరకూ ప్రతిదానికీ ఇందులో డిటైల్స్ ఉంటాయి. మానవుని పుట్టుక, వృద్ధి, వినాశనాన్ని ఏయే విషయాలు ప్రభావితం చేశాయో.... దాదాపు వాటన్నింటినీ తెరపై చూపించారు.. ఫాబియో ఫ్రీడీ. ఆయన అందించిన ఈ చిత్రం ఎన్నో కఠిన వాస్తవాల్ని, కాంట్రాస్టుల్ని మనముందుంచుతుంది. వర్త్‌వాచ్ అని చెప్పుకునే కొన్ని అరుదైన లఘుచిత్రాల్లో ఇదీ ఒకటి. వీలు చూసుకుని మరీ చూడండి.. ఈ 6 నిమిషాల ప్రపంచాన్ని, హింస, డ్రగ్స్, శృంగార వికృతాల వంటి డిటైల్స్ కొన్ని ఉంటాయి. మెచ్యూర్డ్ కంటెంట్ కనుక పెద్దల పర్యవేక్షణ అవసరం.

ఇన్ని రీతులా...!

సంగీతికా..!

'26 మ్యూజిక్ జోనర్స్ ఇన్ అల్ఫాబెటికల్ ఆర్డర్'.... సంగీత ప్రపంచం చాలా విశాలమైంది. ఏదో కొత్త జోనర్ యాడ్ అవుతూనే ఉంటుంది. ఒక్కోదానిదీ ఒక్కో ప్రత్యేకత. వీటిల్లో తేడాలేంటో.. అసలు వాటి పేర్లేంటో.. అవెలా ఉంటాయో చాలామందికి తెలీదు. మన ఖవ్వాలీల నంచి ట్రాన్స్ సంగీతం వరకూ మొత్తం 26 సంగీత రీతుల్ని ఈ వీడియోల్లో వినొచ్చు. కేవలం సంగీతం వినడమే కాదు, వాటికి తగ్గ వస్త్రధారణ, బాడీ లాంగ్వేజ్ కూడా ఇందులో కనిపిస్తుంది. బోయినా బ్యాండ్ ఈ వీడియోల్ని రూపొందించింది. ఇదేకాదు, మరికొంతమంది సంగీతకారులు, ప్రియులూ సంగీత లోకాన్ని బిట్లు బిట్లుగా మీ ముందుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. సరదాకి చూడండే. వీటన్నింటినీ గంటలు గంటలు కచేరీలు పెట్టరులెండి.. కేవలం కొన్ని నిమిషాల్లో మొత్తం తిప్పేస్తారు.

వన్యత క్రమత



మనమెలా చూస్తామో ప్రపంచాన్ని మిగతా వన్యజీవులూ అలానే చూస్తాయనుకోవడం తప్పు అని ఆర్టిస్ట్ జన్నా జెడ్.హెచ్. ఫీల్డ్ అంటారు. వాటితో మనకెంత అనుబంధమున్నా అవెప్పుడూ విలక్షణమైనవే అంటూ ఇంతకు ముందు ఎవరూ చిత్రించని తీరులో జంతువుల రూపాల్ని వేస్తారు బ్రూక్లిన్‌కు చెందిన జన్నా. ఆమె మాటల్లో ఎంతవరకూ అర్థం చేసుకుంటారో తెలీదు గానీ, వినూత్న శైలిలో ఉన్న వన్యచిత్రాలు మాత్రం అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. మిక్సడ్ మీడియా పేపర్ మీద పెన్ను, వాటర్ కలర్స్, పేస్టల్స్ ఉపయోగించి పెయింటింగ్ వేస్తారామె. వివిధ సంస్కృతుల్లో ఆయా జంతువుల ప్రాధాన్యత ప్రతిబింబించేలా జ్యామితీయ, రేఖా, క్రమతలతో అవి కనిపిస్తాయి.

నీ నవ్వులు తప్ప

అర్ధరాత్రి వేళ
ఊరి పొలిమేరలో
రాలిపడిన నక్షత్రాన్ని
ప్రతి రోజూ
ఏరుకొని సంచిలో వేసుకొని
ఇన్నాళ్ళూ దాచి వుంచాను
ఎన్ని నిద్రలేని రాత్రిళ్ళు
గతించాయో
గురుతులేదు గానీ
మాలకు సరిపడే
నక్షత్రాలు వుంటాయని
కానుకగా నీకు ఇవ్వాలని
సంచి తెరిచాను
ఏమి విచిత్రమో ఏమో
ఒక్క నక్షత్రమూ లేదు
నీ నవ్వులు తప్ప ...!

- సురేంద్ర రొడ్డ
9491523570

parag borse

కవిత్వమ్

మీలాంటి నేను కోసం

మీలాంటి నేను అచ్చంగా
జిరాక్స్ కాపీలా
ఇక్కడ దొరుకుతాను
ఒక పుటలో పలు కాపీల్లా మనుష్యులు
రెక్కల కష్టపు పక్షులై ఎగుర్తుంటారు
అలసి సొలసినపుడు ఎక్కడెక్కడో
ఎగిరిపోతారు గాలి లేపుకెళ్ళే
ఎండుటాకుల్లా మీరు,
కుటుంబాల్లోకో
కుటుంబాల్లేని ఒంటరితనంలోకో
హుక్కా తప్ప ఏమీ మిగలని నవాబుల్లా
ఊపిరిలో పొగనిండిన మత్తు
మాయల్లోకో
చేపపిల్ల కొలనులోపల్నించి పైకొచ్చి
తన కనుగుడ్డు పైన చంద్రవంకను
చిత్రించుకుంటున్న వేళా
నేనిక్కడ దొరుకుతాను మీకు మీలాంటి
నేను
చెట్టు నుంచి రాలిపడ్డ ఆకు
తరంగాల పియానో వాయించే వేళ
అల్లంత దూరాన కొండవాలులపై
పరుచుకునే మేఘంలా
కారునల్లటి దేహం కలవాణ్ణి
నల్లరంగు ప్రేమికుల్లారా
ఇటు వైపు రండి
హృదయం నిండా గాయాలను
భరిస్తున్నా కదా
అడిగితే పిసరంత ఇస్తే బోలెడంత
స్నేహమయ వాత్సల్యం

మీకు అక్కర ఉంటే
ఇటురండి.. అందాన్ని కాకుండా
ఆస్వాదనని ప్రేమించే అనుభవాన్ని
ఆనందించాలనుకుంటున్నారా
మొరటు చేతుల మానవ్వుల్లారా
ఇటురండి..!
నల్లగా కందిన కొండల నీడలను
మోస్తున్న చల్లటి కొలనులాంటి వాణ్ణి
రండి.. మునిగిపోండి.. ప్రేమలో...
ప్రేమలాంటి నవ్వులో
నవ్వులాంటి మౌనంలో
మౌనంలాంటి స్నేహంలో
స్నేహం పొందాలనుకునే స్పందనల్లో
రండి కొలను మీది వెన్నెల నీడలా
పరుచుకోండి
మీలో దుఃఖాన్ని దగా పడ్డ మీ
అంతరంగాల్ని కడిపారుసుకునే
స్వచ్ఛమైన పచ్చదనపు దేహంలోకి
మిమ్మల్ని మీరు వొంచేసుకొని పొంది
నాదీ హామీ
ఇక నుంచి మీరు ప్రపంచంలో
కలియతిరుగుతున్నపుడు
సర్వ విషాలను వొదిలించుకొని
పచ్చని ప్రకృతి హరితంలా పచ్చ
పచ్చగా మీకు మీరు
లభించి తీరుతారు

- మహమూద్
9441027462

చుట్టుముట్టిన చీకటీగలు

అంతరించని
అంతర్యుద్ధపు మలుపులో
ఎడతెగని తడి ఎదను చేరుతోంది...
ప్రతీసారి ఘనీభవిస్తున్న చైతన్యం
శిలాజమై జ్వలిస్తోంది..
కరుకైన కాలం దీర్ఘాంతర్మథనాల మధ్య
జీవిస్తున్న మారణాయుధమవుతోంది..
తొడుగుల్లో దాగిన ప్రశ్నలు
ఒదగలేని సంద్రంలా సమాధానానికై విలపిస్తున్నాయి..
ఉపద్రవపు ఊరేగలు
అంటుకున్న అడవిలా మరుగుతున్నాయి...
బంధరాహిత్యపు ఆనవాళ్ళను దాచడానికై
చీకటీగలు చుట్టుముడుతున్నై

- కళ్యాణదుర్గం స్వర్ణలత
9848626114

sh raza